మే - 2017

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. 200/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

ఫోన్: 08592-231281

సెల్ : 9704255416



బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| అడవిపువ్వులు... | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 05 |
| బైబిల్ ప్రాముఖ్యత | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 07 |
| ఘనురాలు | శ్రీమతి రేచల్ జోసఫ్ | 09 |
| ఏడు సంఘాలు | బ్రదర్ కె. సామ్రాట్ | 11 |
| నన్ను మార్చిన యేసయ్య | సాక్ష్యము | 13 |
| దాతృత్వం | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 15 |
| యాకోబు | మామయ్య కథలు రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 16 |
| బండ క్రింద ఓ పావురమా | సాక్ష్యము | 18 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 23 |



INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

'పరిశుద్ధత' మాస పత్రికను ఆదరిస్తున్న మీ అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. పత్రిక కావాలని ఆన్‌లైన్‌లో రిజిష్టరు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. అయితే చందా కట్టే వారి సంఖ్య ఏ మాత్రం పెరగటం లేదు. ఇది చాలా విచారించదగ్గ విషయం. సంవత్సరానికి కేవలం 200/- రూపాయలు ఇవ్వడం ఎవరికీ భారం కాదు. ప్రభువు కార్యాలకు సహాయ పడటానికి ప్రభువు బిడ్డలను సైతం సాతాను అడ్డుకోవడం చూస్తుంటే దేవుని రాకడ ఎంత సమీపంగా ఉందో అర్ధమవుతుంది. అయితే ప్రభువైన యేసుక్రీస్తు రాకడ కొరకు ప్రతి ఒక్కరినీ సమాయత్తపరచవలసిన బాధ్యత ప్రతి క్రైస్తవుని మీద ఉందని మాత్రం మరువకండి. పత్రిక నిర్వహణకు సంవత్సరానికి మాకు 3,00,000/- రూపాయలు ఖర్చు అవుతుంది. ఇది మాకు భారం అయినప్పటికీ సువార్త ప్రచురించటానికి ప్రభువుపై భారం వేసి ముందుకు సాగుతున్నాము. కాబట్టి మీ వంతు సహాయంగా పత్రిక పొందుతున్న ప్రతి ఒక్కరూ చందా కట్టవలసినదిగా ప్రభువు నామమున మిమ్మును కోరుతున్నాను.

గత కొంత కాలంగా పత్రిక చందా విషయమై అనేకమైన విజ్ఞప్తులు చేస్తూ వున్నాము. అయినా ఎవరూ స్పందించటం లేదు. దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినగా కోరుచున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. చందాదారుల వివరాలను పత్రికా ముఖంగా ప్రచురిస్తున్నాము. ఒకవేళ మీరు చందా కట్టినప్పటికీ మీ పేరు చందాదారుల లిస్టులో లేనట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. బైబిల్ క్విజ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని బైబిల్‌జ్ఞానం సంపాదించుకోవాలని కోరుతున్నాను. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**

**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

**సీరియల్**

# బర్నబా

**12**

**(అపొస్తలుడు రెండవభాగం)**

**- కొడవటికంటి**

బర్నబాకి తను మూడు సంవత్సరాల క్రితం చూచిన మీరా ఇప్పుడు నిజంగానే ఎంతో మారినట్లుగా కనిపించింది. తను కూడా ఒకప్పుడు ఈ ఆస్తిపరుల పందెంలో ప్రభువుని కనుగొనే వరకు ఎంతో మానసిక దౌర్భల్యాన్ని రుచిచూచాడు.

"అయితే మీరా ప్రభువుని తెలుసుకోలేదా?" అడిగాడు.

ఇక్కడ భార్యాబిడ్డల ప్రసక్తి లేదు. ఏర్పరచబడిన వారి జాబితాలో ఉన్నవారు మాత్రమే ఆయనను కనుగొనగలరు. మనము వారి కొరకు ప్రార్ధన మాత్రమే చెయ్యగలము.

భార్య అయినా, బిడ్డ అయినా, అనుడైనా, స్నేహితుడైనా ప్రభువు తర్వాతనే హృదయంలో స్థానము పొందగలరని లోకంలోకి ప్రతి మానవుడు తన స్వంతమని భావించగలగిన పౌసు స్థానానికి ఎవరు ఎదగగలరు అనుకున్నాడు బర్నబా.

మీరాని చూచినప్పుడు, ఆమెలోని గాంభీర్యత ఆమెలో అమాయకపు గంభీరత, తన పెనిమిటి కూడా ఈ లోక సంపాదనలో తనతో సహకరిస్తే తను ఆస్తి సంపాదనలో తన పొరుగున ఉన్న ఐశ్వర్యవంతుల కంటే ఎంతో ఎదిగి ఉండేది అనే అవేదన కనబడుతుంది. షెమయా రోజూ రాత్రివచ్చి ఒక గంట మాట్లాడుతుండేవాడు. ఈ పదిరోజులలో ప్రతి రాత్రి నడిపించబడే ప్రార్ధన కూటములో ఇరవైమంది దాకా ప్రభువును అంగీకరించారు. అందరిలో షెమయా అతి త్వరగా ప్రభువును గూర్చి ఎక్కువగా తెలుసుకున్నారు.

పౌలుకు లుస్త్రలో తగిలిన గాయాలు పూర్తిగా మానిపోయాయి. అంతియొకయలో విడిచి వచ్చిన సంఘములోని విశ్వాసులు ఎలా ఉన్నారో అని ఆలోచించసాగాడు బర్నబా. త్వరగా అంతియొకయ తిరిగి వెళ్ళాలని ఆశగా ఉంది అదే మాట పౌలుతో అన్నాడు.

"అంతియొకయ ఒకటేనా మన బాధ్యత" అన్నాడు. పౌలు ఆలోచిస్తూ "మరి కాదా? యెరూషలేము సంఘము నుండి పంపబడినది అంతియొకయ కొరకు కాదా?" అన్నాడు బర్నబా.

"నిన్ను అంతియొకయ పంపించినది యెరూషలేము సంఘము కాదు" అని ఆగి బర్నబా ముఖంలోకి చూస్తూ "యేసుప్రభువు" అన్నాడు.

బర్నబా అదిరిపోయాడు. నిజమే కదా, ఒక సంఘము ఇంకొక సంఘమునకు కాపరి కాదు, చిన్నదైనా, పెద్దదైనా సంఘములన్నీ ప్రభువునకు ఒకటే.

"అయితే ఇప్పుడు మనము అంతియొకయ వెళ్ళవద్దా, ఇక్కడ నుండి ఒకరోజు ప్రయాణమే కదా!" అన్నాడు నిదానంగా.

పౌలు కొంచెంసేపు ఏమి మాట్లాడలేదు. తన స్నేహితుడు బర్నబా అతని హృదయం అంతియొకయలో ఉన్నది. తన మనసులోని మాట చెపితే బాధపడతాడని మౌనంగా ఉన్నాడు.

"ఇప్పుడు ఇంకా ఏ ప్రాంతాలలో సేవ చెయ్యాలని, నీ ఏర్పాటు ఎందుకు సందేహం?" అన్నాడు కొంచెం గట్టిగా.

"పదిరోజులు మనం తార్సులో ఉండి చేసిన సేవా ఫలితం చూస్తున్నావు కదా!" అన్నాడు మృదువుగా.

"అవును, ఎంతో గొప్ప సేవ జరిగింది. అయితే దానికి కారణం పది సంవత్సరాల నుండి విత్తిన విత్తనముల పంట" అన్నాడు పౌలు.

"అవును" అన్నాడు బర్నబా.

"అయినప్పటికీ మనం ఇక్కడ నుండి వెళ్ళిపోయిన తర్వాత ఈ సంఘమునకు కాపరులుగా షెమయా, ఇంకా కొందిమంది ముఖ్యులను పెద్దలను నియమించి వెళ్దాము" అన్నాడు.

"ఔను, అది ముఖ్యం" అన్నాడు బర్నబా సంతోషంగా.

"అలాగే దర్బేలో, లుస్త్రలో, ఈకొనియలో, మిగిలిన చోట్ల ప్రభువు మనతో స్థాపించిన సంఘములను కూడా దర్శించి శిష్యుల హృదయాలను దృఢపరచి, విశ్వాసమందు నిలకడగా ఉండవలెనన ప్రతి సంఘములోను పెద్దలను ఏర్పరిస్తే మంచిదని నా అభిప్రాయం అన్నాడు.

ఎవరీ పౌలు? తను ఎక్కడైతే మరణావేదన పొందాడో అక్కడికే మరలా వెళదామంటున్నాడు. ఇంతటిలో ఈ సువార్త దండయాత్ర ముగిసింది అనుకుంటే మరలా అదే దారిలో వెళ్దామనుకొంటున్నాడు అనుకొని బాధపడ్డాడు. అయితే హృదయంలోని అవేదనను అణచుకొని...

"సరే, నువ్వు బ్రతికి వున్నావని తెలిసికొనిన ఆ ప్రాంతముల వారు వదిలిపెడతారా?" అన్నాడు బర్నబా.

"మరణం, జీవం ఆయనది. మనది కాదు" అన్నాడు పౌలు దృఢంగా. పౌలు ముఖం చూచిన బర్నబా ఇంక ఏమి మాట్లాడలేకపోయాడు. సిలువ మరణం కొరకు పెరియా నుండి యెరూషలేము బయలుదేరిన యేసు ముఖంవలె ఉన్నది పౌలు ముఖం.

"మరి మీరా విషయం" అన్నాడు దిగులుగా.

"బహుశా ఇదే ఆఖరి చూపేమో" అన్నాడు పౌలు. ఎత్తైన తన కనుబొమ్మల క్రిందున్న చిన్న కళ్ళలో బలమైన తన భవిష్యత్తు ఎంత చీకటిదో, దానిలోని ఆవేదన? భార్యని ఇక ఎన్నడు చూడదని తెలిసీ కూడా ఆమెని విడచి వెళ్ళటానికి నిశ్చయించుకోవడం? కృంగిపోయాడు బర్నబా.

బర్నబా భుజం మీద చేయివేసి నిమిరాడు పౌలు.

"ఈ లోకంలో నివశించినంత కాలం, ఈ గుడారంలో మన ఆత్మ నివశించినంత కాలం, మనకు చేరువయ్యే వారు, విడనాడి పోయేవారే. అందరూ తాత్కాలికులే. మనం వారిని త్రోసివేసినా హత్తుకొనినా అది మన స్వశక్తి వలన సాధ్యం కాదు" అన్నాడు పౌలు.

చాలాసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. ఎదురుగా ఉన్న ప్రధాన ద్వారము నుండి బండ్లు లోపలికి వస్తున్నాయి. కొన్ని బయటకు వెలుతున్నాయి. వ్యాపారం కొరకు బయటకు వెళ్ళే బండ్లు, వ్యాపారానికి సిద్ధపడి లోపలికి వచ్చే బండ్లు వ్యాపారం ముగించుకొని వస్తున్నాయి. సేవకుడు రెండు పాత్రలతో ద్రాక్షారసం తెచ్చి నిలుచున్నాడు. బర్నబాకి ఒక పాత్ర ఇచ్చి తను ఒకటి తీసుకున్నాడు. ఆ ద్రాక్షారసం త్రాగిన తర్వాత బరువైన తన హృదయం కొంచెం తేలిక అయినట్లుగా అనిపించింది బర్నబాకు. ఎదురుగా షెమయా ఆవరణలోనికి రావడం చూశాడు. షెమయా దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"రేపు ఉదయం బండి సిద్ధం చేస్తారా?" అన్నాడు పౌలు.

"ఎక్కడికి" అన్నాడు షెమయా సంతోషంగా.

"దర్బేకు" అన్నాడు పౌలు.

"మరలా మన తిరుగు ప్రయాణం" అన్నాడు షెమయా.

"మీరు ఒక్కరే. మేము లుస్త్ర మీదుగా అత్తాలియ వెళ్ళి అంతియొకయకు వెళతాము" అన్నాడు.

షెమయా ఆశ్చర్యపోతూ బర్నబా వైపు చూశాడు. అంతే ఇంకేమి మాట్లాడవద్దు అన్నట్లు షెమయా వైపు చూశాడు. కొంచెంసేపు షెమయా ఆలోచిస్తూ కూర్చుని, నిరుత్సాహంగా లేచి నిల్చుని వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ప్రార్థన కూటములో పౌలు బర్నబాకు సంఘ పెద్దలను ఏర్పరచే బాధ్యత అప్పగించాడు. ఆ రాత్రంతా ఉపవాస ప్రార్థన ఉదయాన్నే ముగింపు ప్రార్థన. ఇంటికి వచ్చినప్పుడు మీరా ముఖంలో ఏ భావము కనిపించలేదు. భర్త మరలా ఇల్లు వదలి వెళ్ళిపోతున్నాడు బాధ కనిపించలేదు. **(సశేషం)**

**మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు**

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India** |
| | **Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్‌సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.

# అడవి పువ్వులు - ఆకాశపక్షులు

ప్రభువైన యేసుక్రీస్తు తన సేవా పరిచర్యలో చేసిన ప్రసంగాలలో కొండమీద ప్రసంగము ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నది. మనుష్యుల జీవన విధానానికి సంబంధించిన ఎన్నో విషయాలు చక్కని ఉదాహరణలతో అందరికీ అర్థమయ్యేలా బోధించాడు. ధర్మశాస్త్రం నెరవేర్చటానికి సులభమైన మార్గాలు బోధించాడు. మూడు అధ్యాయాల పాటు సాగిన సుధీర్ఘ ప్రసంగంలో మనుష్యులు వారి దైనందిన జీవితంలో పాటించాల్సిన ఎన్నో విషయాలు బోధించాడు.

ధనమును గూర్చి చెప్పేటప్పుడు దేవునితో సమానంగా ధనమును పోల్చాడు. "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" (మత్తయి 6:24). ప్రపంచంలో ఎవరికైనా సరే రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి దేవుడు, రెండు ధనము. ఏ మనిషి అయినా సరే తను జీవించటానికి దేవుడిని ఆశ్రయించాలా? లేక ధనమును ఆశ్రయించాలా? అన్నది తానే నిర్ణయించుకోవాలి. ద్వితీయోపదేశకాండము 30:19లో దేవుడు "నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుట ఉంచి" అని చెప్తున్నాడు. ఎలాగైతే దేవుడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును ఉంచి ఎన్నుకోమని చెప్తున్నాడో అలాగే దేవుడిని ధనమును కూడా మన ముందు ఉంచాడు. ఏదైనా సరే ఒక్కటి మాత్రమే ఎన్నుకోవాల్సి ఉంటుందే తప్ప రెండు ఎన్నుకొనే అవకాశం ఉండదు. అంటే దేవుడూ కావాలి, ధనమూ కావాలి అన్న అవకాశం ఉండదు. చాలామంది ధనమును, దేవుడిని ఏకకాలంలో ప్రేమించాలనుకుంటారు. కాని అది అసాధ్యం. ధనమును ప్రేమించే మనసుతో దేవుడిని వెంబడించాలనుకోవడం వెఱ్ఱితనం. దేవుని మాటలు నిరర్థకము కానేరవు. ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు అని దేవుడు చేప్తే నేను ఉండగలను అనుకోవడం భ్రమపడటం అవుతుంది. ఈ లోకంలో జీవించాలంటే ధనము తప్పనిసరి అని ప్రతి ఒక్కరూ భావిస్తారు కాబట్టి ధనము అనే యజమాని క్రింద పనిచేస్తూ ధనమును ప్రేమిస్తూ దేవుడిని ద్వేషిస్తారు.

కోటి విద్యలు కూటి కొరకే, రెక్కాడితే కాని డొక్కాడదు అన్న సామెతలు మనుష్యులు పుట్టించినవే. వాటి ప్రకారమే జీవిస్తుంటారు. కానీ దేవుడు ఏం చెప్తున్నాడు. "ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకుందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారము కంటే ప్రాణమును, వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా?" (మత్తయి 6:25). దేవుడు అనుగ్రహించిన దేహము ప్రాణము గురించి కాక ఆహారము వస్త్రము గురించి చింతించటం ఎంత అవివేకం?

ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటే బహు శ్రేష్ఠులు కారా? (6:26). అడవి పువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయ్యిలో వేయబడు అడవిగడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల అల్పవిశ్వాసులారా మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా. (6:28-30).

పై వాక్యాలను బట్టి మనం ఏం అర్థం చేసుకోవాలి? ఆకాశపక్షులను దేవుడు పోషిస్తున్నాడు. అడవి పువ్వులను దేవుడు అలంకరిస్తున్నాడు. మరి తన స్వరూపములో తన పోలికె చొప్పున సృజించుకున్న మనిషిని ఇంకెంత అపురూపంగా చూసుకుంటాడో అని అర్థం చేసుకోలేక పోవడం మనిషి ఖర్మకి నిదర్శనం. ఆకాశపక్షులు విత్తవు, కోయవు,

కొట్లలో కూర్చుకొనవు. అడవిపువ్వులు కష్టపడవు ఒడకవు. కాని మనుష్యులు మాత్రం ఇవన్నీ చేస్తారు. ఆకాశపక్షులు, అడవిపువ్వులు దేవుని మీద ఆధారపడతాయి కాబట్టి దేవుడు వాటి విషయం ఆలోచిస్తున్నాడు. కానీ మనుషులు దేవునిపై కాకుండా వాళ్ళపై వాళ్ళు ఆధారపడుతూ ధనమును ఆశ్రయిస్తారు. అందుకే దేవుడు మనుష్యులను పోషించడు. ఎందుకంటే దేవుడు తమ్మును పోషించే అవకాశం దేవుడికి ఇవ్వరు.


ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశము నుండి కనాను దేశమునకు బయలుదేరిన కాలమంతా అనగా 40 సంవత్సరాలు దేవుడు వారిని పోషించాడు. ఒక్కరు ఇద్దరు కాదు సుమారు 20 లక్షల మందిపైగా ఉన్న ఇశ్రాయేలు వారిని 40 సంవత్సరాలు అంటే ఒక మనిషి సంపాదించ గలిగినంత కాలం దేవుడు వారిని పోషించాడు. దేవదూతల ఆహారం వాళ్ళకి పెట్టాడు. ఏది కావాలంటే అది వాళ్ళకి అందించాడు. వాళ్ళ కాలు వాయలేదు, వారి బట్ట నలగలేదు. అంతగా వాళ్ళని చూసుకున్నాడు దేవుడు. వాళ్ళు ఎంతగా అవిధేయత చూపించినా కూడా ఇచ్చిన మాట కోసం వారిని పోషించాడు. 20 లక్షల మందే కాదు ఈ భూమి మీద ఉన్న 800 కోట్ల మంది దేవుని మీద ఆధారపడ్డా కూడా దేవుడు పోషించగల సమర్ధుడు. అయితే మనిషి దేవున్ని లెక్కచెయ్యడు. అసలు దేవుడే లేడనేవాడికి దేవుడు మాత్రం ఏం చెయ్యగలడు. ఈ లోకంలో మనుష్యులు వాళ్ళను పోషించుకోవడానికి పడే పాట్లు చూసి దేవుడు ఎంతో బాధపడుతుంటాడు.

సొలొమోను యొక్క వైభవం ఎంతో గొప్పది. భూమి మీద అంతటి జ్ఞాని కాని, అతనికున్న ఐశ్వర్యము కాని, అతని పేరు ప్రఖ్యాతులు కాని ఎవరికీ లేవు. అంతటి గొప్ప వ్యక్తి కూడా అడవిపువ్వులా అలంకరింపబడలేదు అని దేవుడు చెప్తున్నాడంటే, అడవిపువ్వు పట్ల దేవుడు ఎంత శ్రద్ధ వహించాడో మనం అర్థం చేసుకోవాలి. ఒక్కరోజు ఆయుష్షు ఉన్న అడవిపువ్వుకే అంతటి అందాన్నిచ్చి అలంకరించాడంటే 70 సంవత్సరాల ఆయుష్షు ఇచ్చిన మనిషిపట్ల దేవుడు ఇంకెంత శ్రద్ధ వహిస్తాడో మనం ఆలోచించాలి.

ఆహారము, వస్త్రము కోసం చింతించడం, వాటిని సంపాదించుకోడానికి దేహము, ప్రాణము అనుగ్రహించిన దేవుడిని లెక్క చెయ్యకపోడవం. తమ్మును తాము పోషించుకోవడమే జీవిత పరమావధి అని భావించడం అవివేకం. అన్యజనులు వీటన్నిటి విషయం విచారింతురు అంటే క్రైస్తవులు కాకుండా ఇతర మతాల వాళ్ళు అని కాదు కాని, దేవుడిని ఎరుగని జనాంగము అని అర్థము. క్రైస్తవులలో కూడా దేవుడిని ఎరుగని వాళ్ళు అనేకమంది ఉన్నారు. ఆ మాటకొస్తే ఎవరైతే ఆహారము కొరకు వస్త్రము కొరకు చింతిస్తుంటారో వాళ్ళంతా అన్యజనాంగమునకు చెందిన వారే. ఎందుకంటే దేవుడిని ఎరిగిన వాళ్ళు వీటి కోసం ఎప్పుడూ చింతించరు. ఇవన్నీ మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. ఆకాశపక్షులకు ఎలా అయితే దేవుడు ఆహారము సిద్ధపరుస్తున్నాడో, వాటికంటే బహు శ్రేష్ఠులైన మనుష్యుల కోసం కూడా సిద్ధపరుస్తాడు. దేవునిపైన ఆధారపడిన వారు మాత్రమే వాటిని పొందుకుంటారు.

## -: పాఠకులకు గమనిక :-

**ఫేస్‌బుక్, ఆన్‌లైన్ తెలుగుబైబిల్ వెబ్‌సైట్, బైబిల్ క్విజ్ ద్వారా ఒక సంవత్సరం పాటు ఉచితంగా పత్రిక పొందుతున్న పాఠకులకు సంవత్సరం ముగిసిన వెంటనే వారికి పత్రిక నిలిపివేయడం జరుగుతుంది. కాబట్టి ముందుగానే సంవత్సర చందా రూ.200/- కట్టి రెన్యువల్ చేసుకోవడం ద్వారా 2 సంవత్సరాలు పత్రిక పంపబడుతుంది. పాఠకులు సహృదయంతో అర్థం చేసుకొని వెంటనే సంవత్సర చందా పంపగలరు -ఎడిటర్**



10

# బైబిలు ప్రాముఖ్యత

**(Importance of the Bible)**

**సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్**

రక్తమాంసములతో ఉన్న మన శరీరమునకు బేధికమైన ఆహారం ఎంత అవసరమో మన ఆధ్యాత్మిక జీవితానికి వాక్యము అంతే అవసరం. ఆహారం తీసుకోవడానికి కొన్ని ఇష్టాలు, అలవాట్లు, సమయాసమయాలు ఉంటాయి. అలాగే ఈ నూతన సృష్టియైన ఆత్మీయ జీవిత ఎదుగుదలకు కూడా ఒక ప్రత్యేక పద్ధతిలో, క్రమము తప్పక ఒక మోతాదు ప్రకారం తీసుకొనిన ఆధ్యాత్మిక వాక్యపఠనము ఎంతో మేలు చేస్తుంది. బైబిల్ చదవడానికి ఒక క్రమము, అలవాటు ఉండాలి. అలాగే ఒక ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తే మంచిది. లేకపోతే మర్చిపోతాం. మన అనుదిన జీవితంలో నిద్రలేవడం మొదలు నిద్రపోయే వరకు చాలా చర్యలు కేటాయించబడిన సమయంలోనే చేస్తాం. మరి వాక్య ధ్యాన మునకు, వ్యక్తిగత వాక్య ధ్యానమునకు, కుటుంబ ప్రార్ధన లకు మనమెందుకు సమయాన్ని కేటాయించలేకపోతున్నాం. ఎందుకు ఈ విషయానికి ప్రాధాన్యత ఇవ్వలేక పోతున్నాం! ప్రయత్నిద్దాం! ఉదయాన్నే పనులను పురమాయించకోడానికి ముందయితే చాలా మంచిది. యేసుక్రీస్తు వారు పెందల కడనే, ఇంకను చీకటిగా ఉండగానే తండ్రి సన్నిధిలోనికి వెళ్ళే వారని మీకు జ్ఞాపకం ఉండవచ్చు. సరే బైబిల్ ధ్యానమునకు ఉదయమో లేదా సాయంత్రం అన్ని పనులు ముగిసిన తర్వాతనో లేదా రోజు మధ్యలో ఎప్పుడైనా సరే ఏ సమయంలో ధ్యానించు చున్నావో అనేది ప్రశ్న కాదు ఇక్కడ, అసలు బైబిల్ ధ్యానమునకు ప్రత్యేక సమయం ఉందా? దానిని క్రమంగా వాక్యధ్యానము, తద్వారా ఆయన చిత్తానుసారమైన నడవడికకు వాడుకుంటున్నామా అనే స్వీయ పరిశీలన కావాలి.

మొదటిగా బైబిల్‌లోని 66 పుస్తకములలో ఉన్న మూల కథలను విపులంగా తెలుసుకుంటే మంచిది. బైబిల్ పుస్తకములను, పుస్తకములలోని మూల వచనములను కంఠస్తం చేస్తే కూడా మంచిదే. ఇష్టమైన వాక్యాలను, అధ్యాయాలను వీలైనంత వరకు మరీ మరీ చదువుతూ ఉంటే దేవుడు తప్పక మాట్లాడుతాడు. వీలైనంత వరకు మీ అంతట మీరే ఒక ప్రణాళిక వేసుకొని, ఆదికాండము మొదలు ప్రకటన వరకు చదవటానికి ప్రయత్నం చేయండి. ఇంకా వీలైతే మీకు ఇష్టమైన బైబిల్ వ్యక్తులను, స్థలాలను, సందర్భాలను, వచనాలను, పేరాగ్రాఫ్‌లను అధ్యాయం చేయడం మంచిది. వ్యక్తిగతంగా ఏకాంతంలో ధ్యానం చేయడం ఎంత అవసరమో, ఒక గ్రూపుగా కూడా బైబిల్‌ను ధ్యానం చేయడం ఆత్మీయ జీవితానికి అంతే మేలు చేకూరుతుంది.

చాలామంది ఇప్పటి యౌవనస్థులే కాక పది పన్నెండు సం॥రాల వయసు పిల్లలు కూడా చందమామ, బుజ్జాయి ప్రభలు, పత్రికలు పెద్దపెద్ద నవలలు మొదటి పేజి నుండి చివరి పేజి వరకు చదవందే కూర్చున్న స్థలం నుండి పైకి లేవరు. ఇక వేసవి సెలవులు వచ్చాయంటే వారికి అదే పని. ఇలాంటివారు చాలామంది నాకు తెలుసు. ఆంధ్రప్రభ, పత్రికలలో సీరియల్ కొరకు తదుపరి కాపీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటారు. ఇదంతా ఎందుకు చెపుతున్నా నంటే బైబిల్ చదివేటప్పుడు ఎక్కడో ఒకపేజీ తెరచి అందులో ఏవో కొన్ని వరుసలు చదివి బైబిలు మూసివేసే వారు మన క్రైస్తవులలో అనేకులు ఉన్నారు. అలాకాకుండా ఒక్కో పుస్తకం పూర్తిగా అధ్యాయం చేస్తే బాగుంటుంది.

బైబిలులోని ప్రతి పుస్తకములో పరిశుద్ధాత్మ దేవుడు గ్రంధకర్తకు ఒక విషయం బోధించి వ్రాయించి ఉంటాడు. వీలైనంత వరకు ఆ పుస్తకంలోని పేజీలను మొదటి నుండి

చివరి వరకు అధ్యాయనం చేస్తే గ్రంథకర్త ఉద్దేశ్యము, పరిశుద్ధాత్ముని పని మన జీవితంలో సఫలం అవుతుంది. అలాగే బైబిల్‌లో ఆదికాండము మొదటి అధ్యాయం మొదటి వచనం నుండి ప్రకటన ఆఖరి అధ్యాయం ఆఖరి వచనం వరకు అధ్యాయం చేయడంలో ఎంతైనా ఆశీర్వాదం ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రయత్నం చేయండి.

దేవుని రక్షణ ప్రణాళిక బైబిల్ మొదటి పేజీ నుండి ఆఖరి పేజీ వరకు భద్రపరచబడి ఉంది. కనుక బైబిల్‌ను ఒకే ఒక పుస్తకంగా భావించి పూర్తిచేయడంలో ఆశీర్వాదం ఉందని మరోకసారి చెప్పవచ్చును. అందుకే ఆది క్రైస్తవ సంఘకాపరులు 66 పుస్తకములలోని ఆది కొత్తనిబంధనలు అని కూడా అనడం పరిపాటే. పుస్తకంగా చదివినా, 66 పుస్తకాలను ఒకే పుస్తకంగా భావించి అధ్యాయనం చేసినా ఒక ప్రణాళిక తీసుకొని అధ్యాయనం చేస్తే మంచిది. చాలామంది మౌనంగా గదిలో కూర్చుని ప్రతి వరుసని పదేపదే చదివి అర్థం చేసుకుంటూ ఉంటారు. మరికొందరు పెదవి విప్పి గొంతు తెరచి చదువుతుంటే అర్థం అవుతుంది. ఆనందంగా ఉంటుంది అంటారు. చాలా కుటుంబాలలో కుటుంబ ప్రార్థనలలో బైబిల్ మొదటి నుండి చివరి వరకు అధ్యాయనం చేసే అలవాటుంది. అది చాలా మంచిది. ఇలా ప్రార్థనలో కూర్చునప్పుడు ఒక్కొక్కరు ఒకటి రెండు వచనాలు చదివి ఆ దిన పాఠమును ముగిస్తుంటారు. ఇలాగే ఒకసారి అమెరికాలోని ఓక్లహామా రాష్ట్రంలో ఒక బాప్టిస్ట్ సంఘ పాస్టర్‌గారైన రెవ.విల్‌బర్ నకల్స్ ఆయన సంఘ సభ్యులు జాతీయ దృష్టిని ఆకర్షించడానికి ఆ సంఘములో బైబిల్ ఆపకుండా చదవడం మొదలుపెట్టారు. ఒక బుధవారం ఉదయం సరిగ్గా 9 గంటలకు పాస్టర్ నకల్స్‌గారు ప్రసంగ వేదికనెక్కి "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను అని మొదలుపెట్టి దాదాపు పదిహేను నిమిషాల అనంతరం అదే స్థలంలో మరియొక సంఘ సభ్యురాలు పాస్టరుగారు ఆపిన దగ్గరనుండి చదవడం ప్రారంభించారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు చదువుతూ ఆదికాండము, నిర్గమకాండము ఇలా పాత నిబంధన కొత్త నిబంధన పుస్తకం వెంబడి పుస్తకం చదువుతూ చివరిగా ఆదివారం తెల్లవారు జాము 3 గంటల 55 నిమిషాలప్పుడు ఒక పాప ప్రకటన గ్రంథములోని ఆఖరి వచనం "ప్రభువైన యేసుక్రీస్తు కృప పరిశుద్ధులకు తోడైయుండును గాక! ఆమెన్" అని చదవటంతో పూర్తి అయిందట. ఇలా చదవడానికి దాదాపు 78 గంటల 55 నిమిషాలు పట్టింది. మంచిదే ఇది ఒక సవాలే మనందరికి చదవడమే కాదు దానిని అర్థం చేసుకొని అనుసరించి నడచి మనకు ఇతరులకు మేలుకరంగా ఉండాలి. ప్రతి చదువరికి ఒక ఆసక్తికరమైన బైబిల్ భాగం ఉండవచ్చు. కొందరికి పాతనిబంధనలోని వ్యక్తుల చరిత్ర, కొందరికి ప్రవచన పుస్తకాలు, కొందరికి సువార్తలు, కొందరికి పత్రికలు, కొందరికి ప్రకటన, కీర్తనలు, సామెతలు, యోబు అలాగే కొందరికి కొన్ని అధ్యాయాలు కీర్తనలు 23, 1కొరింథి 13వ అధ్యాయం లేదా వచనాలు యోహాను 3:16, రోమా 6:23, ఇలా అనేకం. బైబిల్ గ్రంథములో పుస్తకములలో ఒక అనుబంధము కనిపిస్తుంది. ముందుగా చెప్పుకున్నాము మొదటి పేజీ నుండి ఆఖరి పేజీ వరకు ఒకే అంశము "యేసుక్రీస్తు–మానవాళి రక్షణ" కనిపిస్తుంది కదా. బైబిల్లో ఆయన భక్తులు అనేక చోట్ల ఈ వాక్యమును వారి అనుభవములో ఏమి చెప్పారో చూద్దాం!

"దుష్టుల ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు" కీర్తన 1:1,2. ఈ వాక్యమును బట్టి చూస్తే కీర్తనాకారునిలో ధర్మశాస్త్రమును చదవాలని, ధ్యానించాలనే ఒక తపన, ఆశ, తృష్ణ, ధ్యానించడము వలన కలిగే కొదువలేని నిత్యానిందకరమైన జీవితము తెలుస్తుంది. అందుకే కీర్తన 119:103వ వచనములో కీర్తనాకారుని ఈ వాక్యములు తన జిహ్వాకు ఎంతో మధురములుగాను నోటికి తేనెకంటే తీపిగాను ఉన్నవని వ్రాశాడు. కీర్తన 19:10లో బంగారు కంటెను విస్తారమైన మేలిమి బంగారు కంటెను కోరదగినవి తేనెకంటెను జుంటితేనె ధారలకంటెను మధురమైనవిగాను, కీర్తన 119:127లో బంగారుకంటెను అపరంజికంటెను ప్రియమైనవిగాను కీర్తనాకారుడు వ్రాస్తాడు.

స్త్రీల విభాగము

# ఘనురాలు



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

షూనేము అనే ఒక పట్టణంలో ఒక స్త్రీ ఉంది. ఆమె బాగా ధనవంతురాలు. వారికి బాగా ఇళ్ళు, పొలాలు ఉన్నాయి. భర్త ముసలివాడు. పిల్లలు లేరు. బైబిల్లో ఆమె పేరు లేదు గాని అందరు ఆమెను ఘనురాలు అంటారు. బహుశ ధనవంతురాలనేమో! ఆమె ధనంలో మాత్రమే ఘనురాలు కాక దైవభక్తిలోను ఘనురాలే. ఆతిధ్యం చేయడంలోనూ ఘనురాలే. ప్రవక్తయైన ఎలీషా షూనేము పట్టణానికి తరచుగా వచ్చినపుడు ఆమె తన ఇంటిలోనే అతనికి భోజనం సిద్ధం చేస్తూండేది. అలా చాలాసార్లు ఆమె ఇంటిలో భోజనం చేస్తుండేటప్పుడు ఆమెకు ఒక తలంపు కలిగింది. వెంటనే తన భర్తతో విషయం చెప్పింది.

"మన ఇంటికి వచ్చుచు పోవుచున్నవాడు భక్తిగల దైవజనుడని నేనెరుగుదును. కావున మనము అతనికి గోడమీద ఒక చిన్న గది కట్టించి అతని కొరకు మంచము, బల్ల, పీట, దీపస్తంభము నుంచుదము. అతడు మన యొద్దకు వచ్చునపుడెల్ల అందులో బసచేయవచ్చును" అని చెప్పెను. (2రాజులు 4:10). తన భర్త ఆజ్ఞ తీసుకోవడంలో ఆమె తన భర్తకు లోబడిన విధానం తెలుస్తుంది. ఆయన సహకారంతోనే ఎలీషా కొరకు ఒక గది కట్టించి, అందులో సమస్త సౌకర్యాలు సిద్ధం చేసింది. ఎలీషా ఆ పట్టణంలోకి వచ్చినపుడెల్లా మంచి భోజనంతో పాటు సమస్త సౌకర్యాలతో కూడిన గదిలో చక్కగ విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాడు. అందుకే ఆమెకేదైనా ఉపకారం చేయాలని ఎలీషా తలంచి తన సేవకుడైన గెహజి ద్వారా ఆమెను పిలువనంపించాడు. ఆమె వచ్చి అతని ముందు నిలువబడింది.

"నీవు ఇంత శ్రద్ధాశక్తులు చూపిస్తున్నావు నీకు నేనేం చేయాలి? రాజుతోనైనా సైన్యాధిపతితోనైనా నిన్ను గూర్చి నేను మాటలాడాలని కోరుతున్నావా?" (2రాజులు 4:13) అని ఆమెను అడిగాడు. ఇదే అవకాశంగా ఆమె ఏదైనా కోరుకోవచ్చును గాని ఆమె ప్రతిఫలాన్నాశించి అతనికి సేవలందించడం లేదు. కాని దేవునియందు భయభక్తులు గలదై దైవజనుని ఆదరించి ఆతిధ్యమిచ్చింది. అందుకే ఆమె వెంటనే "నేను నా స్వజనులలో కాపురమున్నాను" అని (13) జవాబిచ్చింది.

నిస్వార్ధముతో ఆమె చేస్తున్న సేవ త్యాగపూరితమైనది. ఏ మాత్రము ప్రతిఫలం ఆశించలేదు. ఒకవేళ ఆ ఉద్దేశ్యంతో ఆమె చేయకపోయినా ఇప్పుడు వచ్చిన అవకాశం కూడా ఉపయోగించుకోలేదు. అవకాశం కోసమే దగ్గరకు చేరేవారు చాలామంది ఉంటారు. అవకాశాలు బాగా ఉపయోగించుకొని అవసరాలు తీరాక వారి ముఖం కూడా చూడని వారు ఎంతమందో! అందుకే ఈమె నిస్వార్ధంలో కూడా ఘనురాలుగ ఎంచబడింది. అయితే గేహజీ ఈ అవకాశం ఆమె పోగొట్టుకోవడం ఇష్టంలేక తానే "ఆమెకు కుమారుడు లేడు, ఆమె భర్త ముసలివాడు" (14వ) అని చెప్పాడు. వెంటనే ఎలీషా ఆమెను పిలిచి "మరుసటి యేట ఈ రుతువున నీ కౌగిట కుమారుడుండును" అని (16వ) ఆమెతో చెప్పాడు. తర్వాత ఆమె గర్భవతియై కుమారునికి జన్మనిచ్చింది. దేవునియందు ఆమెకున్న భయభక్తులు, భర్తకు లోబడే వినయవిధేయతలు, నిస్వార్ధ గుణమూ ఆమె గొడ్రాలితనాన్ని పోగొట్టి ఒక కుమారునికి తల్లిగా చేశాయి.

కొన్నాళ్ళ తర్వాత ఆ కుమారుడు తండ్రితో కూడా పొలం వెళ్ళాడు. పనివారు పనిచేస్తుంటే చూస్తూవున్నాడు. కాని


అంతలోనే ఎండదెబ్బ తగలడం వల్లనేమో తలనొప్పి ప్రారంభమై మరి ఎక్కువైంది. పిల్లవాడి బాధ ఎక్కువ కావడం చూచి పనివారితో తల్లి దగ్గరకు పంపించాడు తండ్రి. కాని ఆ కుమారుని బాధ మరింత ఎక్కువై మధ్యాహ్నం అయ్యేసరికి తల్లి ఒడిలోనే ప్రాణం విడిచాడు. తల్లి బాధ ఓర్వలేనిది కదా! అందులో లేక లేక పుట్టిన కొడుకు. అయినా ఆమె గుండె నిబ్బరం చేసుకుంది. గగ్గోలు పెట్టి ఏడ్చి గందరగోళం చేయకుండా దుఃఖమంతా గుండెల్లోనే దాచుకొని కొడుకును ఎత్తుకొని దైవజనుని కొరకు కట్టిన గదిలో, అతని కొరకు అక్కడ ఉంచిన మంచం మీద వానిని పండుకోబెట్టి తలుపు వేసి బయటకు వచ్చింది. దైవజనుని దగ్గరకు వెళ్ళడానికి భర్త ఆజ్ఞ తీసుకుంది. అప్పుడు భర్తకు కూడా విషయం చెప్పలేదు. భర్త – విశేషము ఏమీ లేదే ఎందుకు దైవజనుని వద్దకు వెళ్ళడం అని అడిగినపుడు "నేను పోవుట మంచిది" (24వ) అని చెప్పిందేగాని విషయం చెప్పలేదు. అది దైవసన్నిధిలోనే మొదటిగా చెప్పుకోవాలని ఆమె కోరిక. అందుకే గాడిద ఎక్కి త్వరత్వరగా దైవజనుడైన ఎలీషా దగ్గరకు వెళ్ళింది. దైవజనుడు కర్మెలు పర్వతం మీద ఉన్నాడు. దూరము నుండి ఆమెను చూచి త్వరగా పనివాని ఆమెకు ఎదురుపంపి "నీవును, నీ పెనిమిటియు, నీ బిడ్డయు సుఖంగా ఉన్నారా?" అని అడుగమన్నాడు. పనివాడు ఆ మాట అడిగిన వెంటనే ఎంతో నిబ్బరముగా "సుఖముగా ఉన్నాము" (26వ) అని చెప్పింది. ఎందుకంటే ముందుగా దైవజనుని దగ్గర మాత్రమే చెప్పాలని ఆమె విశ్వాసంతో కనిపెట్టింది. ఆ విశ్వాసంతోనే నిబ్బరంతో సుఖంగా ఉన్నామని చెప్ప గలిగింది. ఆ తరువాత కర్మెలు కొండమీద ఉన్న దైవజనుని దగ్గరకు వెళ్ళి అతని కాళ్ళు పట్టుకుంది. గేహజీ ఆమెను దైవజనుని యొద్దకు రాకుండా ఆటంకపరచాలని చూచాడు. ఎలీషా అతనిని వారించాడు. ఆమె తన బాధ దైవజనునికి తెలిపింది. అంతవరకు తన హృదయక్షోభ తన గుండెలోనే దాచుకొని వేరెవ్వరికి చెప్పలేదు. వెంటనే ఎలీషా లేచి ఆమెతో కూడా ఆమె ఇంటికి వెళ్ళాడు. తన కొరకు ప్రత్యేకింపబడిన ఆ గదిలో తన మంచం మీద మరణమైన ఆమె కుమారుడు ఉండడం చూచి ఆ గది తలుపు మూసి దేవునికి ప్రార్థన చేశాడు.

తరువాత బిడ్డ మీద తన్ను తాను చాచుకొని పొడుగుగా పండుకొనగా బిడ్డకు వెట్టపుట్టి ఏడు మారులు తుమ్మి కళ్ళు తెరిచాడు. దైవజనుడు ఘనురాలైన ఆమెను పిలిచి బిడ్డను ఆమెకు అప్పగించాడు. ఆమె అతనికి సాష్టాంగ నమస్కారం చేసి బిడ్డను ఎత్తుకొని వెళ్ళింది. ఏదైనా కష్టం వచ్చినపుడు అది ఎంత పెద్ద కష్టమో, దాని వలన కాదు ఎంత బాధపడిపోతున్నారో ఇరుగు పొరుగు వారికి, ఇతరు లకు, వివరించి, వివరించి చెప్పి పెద్దగోల చేసుకోవడం చాలామందికి అలవాటే. అంతా దేవునికి అప్పగించి దేవుని దగ్గరే మన హృదయాన్ని కుమ్మరించుకోవడం ఎంతో అవసరం కదా!

అందుకే ఈ షునేమీయురాలు ధనములో మాత్రమే ఘనురాలు కాక దేవునియందు భయభక్తులలో ఘనురాలు. దైవజనులను గౌరవించడంలో ఘనురాలు. భర్తకు లోబడిన ఘనురాలు. నిస్వార్థ పరిచర్యలో ఘనురాలు. విశ్వాసంలో ఘనురాలు. దైవసన్నిధికి ప్రాముఖ్యత నివ్వడంలో ఘనురాలు. అందుకే ఆమె ఘనురాలుగా ఎంచబడి గొప్ప ఆశీర్వాదాలు పొందింది. గొడ్రాలుగ ఉన్న ఆమె సంతుగల తల్లిగా ఆశీర్వదింపబడింది. చనిపోయిన కుమారుని ప్రాణంతో తిరిగి పొందింది. ఏడు సంవత్సరములు ఫిలిష్తీయ దేశంలో గడిపి కరువు కాలము ముగిసిన తరువాత తిరిగి వచ్చినపుడు రాజు ఆమె పక్షముగా ఒక అధిపతిని నియమించి ఆమె సొత్తు యావత్తు ఆమెకు ఇప్పించాడు.

వాక్యంలోని ఈ వనిత ఏ గుణగణాలతో ఘనురాలిగా ఎంచబడిందో తెలుసుకొని – ఆమెను అనుసరించడం ప్రతి వనితకూ అవసరం. ఆలాగు చేయుటకు ప్రయత్నిం చుదము గాక!

# ఏడు సంఘాలు



బ్రదర్ కె.సామ్రాట్

## సార్దీస్ సంఘము

**(మృత సంఘము. ప్రకటన 3:1-6)**

ఇంతవరకు సార్దీస్‌లోని తప్పులు చెప్పబడ్డాయి. అయితే ఒకే ఒక మెప్పు కూడా ఉన్నట్లు చూస్తాము. "అయితే తమ వస్త్రములను అపవిత్రపరచుకొనని కొందరు సార్దీస్‌లో నీ యొద్ద ఉన్నారు. వారు అర్హులు గనుక తెల్లని వస్త్రములు ధరించుకొని నాతో కూడా సంచరించెదరు" (4వ). అంటే సంఘాల పట్టీలలో క్రైస్తవులైనట్లు చాలామంది పేర్లు ఉన్నాయిగాని కొందరు మాత్రమే వారిలోంచి ప్రత్యేకించ బడి, తమ జీవితాలను పవిత్రంగా ఉంచుకున్నారు. వారి వస్త్రాలు తెల్లగా ఉన్నాయి. తెల్లని వస్త్రాలు పరిశుద్ధతకు గుర్తు. ప్రతియుగంలో యిలాంటి పరిశుద్ధులు లేకపోలేదు. వీరు పాపానికి దూరంగా ఉండి తమ జీవితాన్ని యోగ్యంగా ఉంచుకున్నారు. లోకస్నేహాన్ని ద్వేషించారు. వస్త్రాలు బురదతో మైలపరచుకొనకుంటే వారు క్రీస్తుతో కూడా నడుచుటకు అర్హులు.

అమెరికాలో ఓ ముఖ్య పట్టణంలో జరిగిన ఒక సంఘటనను గూర్చి రాబర్ట్ జి.లీ. అనే ప్రఖ్యాత ప్రసంగీకుడు యిలా చెప్పాడు. ఒక చిన్నబ్బాయి ఇల్లు లేకుండా వీధులలో తిరుగుతుంటే, దంపతులిద్దరు వాణ్ణి తమ యింటికి పిలుచుకు వెళ్ళారు. వాడిని బాగా రుద్ది స్నానం చేయించి, అందమైన కొత్త సూటును తొడిగారు. అద్దం ముందు నిలుచుని తన క్రొత్త దుస్తుల్ని చూచుకొని మురిసిపోయాడు. అంతకు ముందెప్పుడు ఆ అబ్బాయి అంత శుభ్రంగా కనిపించలేదు. రాత్రి పడుకునే ముందే సూటు తీసి పైజమా వేసుకోవలసి వచ్చింది. అది కుర్రవాణ్ణి కొంత కలత పెట్టింది. ఆ యజమానురాలు, ఆ అబ్బాయిని పడుకోబెడుతూ ఆ చిన్నారికి మొదటి ప్రార్థనను నేర్పింది. తన వెనకాల చెప్పమంది. "ప్రియ ప్రభువా! నేనిప్పుడు పడుకోమన్నాను, నన్ను కాపాడమని ప్రార్థిస్తున్నాను" బాగానే ఉంది. కానీ నిద్రలో ఆ చిన్నారి యిలా కలవరిస్తు న్నాడు. ప్రియప్రభువా నేనిప్పుడు పడుకోనున్నాను. నా బట్టలను కాపాడు అని ప్రార్థిస్తున్నాడు. ఆ యింటావిడ ఆశ్చర్యపడింది. ఆమె మృదువుగా అతని తప్పును సవరించింది. అయితే చిన్నారి తిరిగి, తిరిగి "నా బట్టల్ని కాపాడు" అన్న విన్నపాన్నే ప్రార్థించాడు. అయితే ఈ కథలో అర్థం లేకపోలేదు. తన బట్టలు పరిశుభ్రంగా భద్రంగా ఉండాలని ఈ చిన్నారి కోరినట్లే మనము కూడా పాప పంకిలమైన ఈ లోకంలో మన జీవితాలకు, రక్షణ వస్త్రాలను పాపపు డాగులు అంటకుండా కాపాడమని ప్రార్థించాలి. ప్రభువు తన పరిశుద్ధాత్మ సాయంతో మనల్ని అపవిత్రపరచే వాటిని జయించటానికి శక్తిననుగ్రహిస్తాడు. అలా మన జీవన వస్త్రాల్ని పవిత్రంగా కాపాడుకుంటే, ఆయనతో కూడా సంచరిస్తాం (2కొరింథీ.6:18). తెల్లని వస్త్రాలు ధరించిన వారు దేవునితో సంయుక్తపరచుకున్న ప్రజలు. సోదరుడా! సోదరీ నీ వస్త్రాలు ఎలా ఉన్నాయి?

సార్దీస్‌లో జయించు వానికి ప్రభువు మూడింతల వాగ్దానం అనుగ్రహించాడు. "జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనుచు, జీవగ్రంథములో నుండి అతని పేరెంతమాత్రమును తుడుపుపెట్టక, నా తండ్రి యెదుటను, ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును (5వ). మొదటిది తెల్లని వస్త్రం. తెల్లని వస్త్రం పరిశుద్ధతకు, నీతికి సూచన. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నీతిని పొందిన విశ్వాసులకు తెల్లని వస్త్రాలు లభిస్తాయి. కానీ సార్దీస్‌లో కొందరు తమ వస్త్రాల్ని మైలపరచుకున్నారు. వారు దేవుని రాజ్యములో ప్రవేశించ లేరు. గొఱ్ఱెపిల్ల పెండ్లి విందుకు పెండ్లి వస్త్రము లేకుండా హాజరైన వారికి పట్టిన గతే వీరికిని పడుతుంది (మత్తయి

22:13). గొఱ్ఱెపిల్ల రక్తములో తమ వస్త్రములను ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొనినవారు (ప్రకటన 7:14) పెద్దలవలె (4:4) హతసాక్షులవలె (6:11) యింకా అనేకులవలె (7:9) ప్రభువు సైన్యమువలె తెల్లని వస్త్రాలు ధరించుకుంటారు. వారు క్రీస్తునందు దేవుని నీతిని వస్త్రముగా ధరించుకొనినవారు (యోబు 29:14). ప్రియ సంఘమా, నీ వస్త్రాలు ఎలా ఉన్నాయి? ఈ భాగము చదువుతూ ఉండగా నీ వస్త్రాలు గొఱ్ఱెపిల్ల రక్తములో ఉదుకుకొనుము. తమ వస్త్రాలు ఉదుకుకొనువారు ధన్యులు (22:14).

రెండవది, జయించువారి పేర్లు జీవగ్రంథములో నుండి ఎన్నటికిని కొట్టివేయబడవు. ఇది సార్దీస్ వారికే కాదు, విశ్వాసులందరి విషయములోను యథార్థం. భూలోకంలో ఉన్నవారందరి పేర్లు యిందులో ఈ గ్రంథంలో వ్రాయ బడతాయి. కానీ ఎవరు రక్షణ పొందరో (మారు మనస్సు పొందరో) వారి పేర్లు తుడిచివేయబడతాయి. ప్రభువుని ఎరుగని వారి పేర్లు జీవగ్రంథంలో కనబడవు. జయించిన వారు కొందరున్నారు. గనుక వారి పేర్లు తుడిచిపెట్టబడవు. దావీదు పాపుల గురించి మాట్లాడుతూ "జీవగ్రంథములో నుండి వారి పేరును తుడుపు పెట్టుము. నీతిమంతుల పట్టీలో వారి పేరులు వ్రాయకుము" (ప్రకటన 13:8, 17:8, 20:15) అంటున్నాడు (21:27) సోదరుడా, నీ పేరుందో లేదో పరీక్షించుకో.

మూడవది, జయించువానిని, దేవుని యెదుటను ఆయన దూతల యెదుటను ఒప్పుకొనుటకు ప్రభువు సిగ్గుపడడు. ఇదెంత గొప్ప వాగ్దానమో గమనించండి. (లూకా 9:26, 12:8,9, మత్తయి 10:32). మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేను వానిని ఒప్పుకొందును. కావున ప్రతి విశ్వాసీ ఈ మూడు వాగ్దానములను స్వతంత్రించు కోవాలి.

**ముగింపు మాటలు:** మన క్రియల నెరిగిన ప్రభువు తేటగా చెప్పేదేమంటే జీవిస్తున్నావన్న పేరుంది గాని నీవు మృతుడవే. యేసు చెప్పిన ప్రకారం సజీవులన్న ప్రసిద్ధి ఉన్నా వారు జీవచ్ఛవాలు. ఈ సంఘంలో జీవకణాలు సరిగా పనిచేయక బలహీనమైనది. కొందరు సభ్యులు ప్రభువు కొరకు జీవిస్తుండగా మిగిలిన వారు జీవించడమే మరచిపోయారు. సంఘం ఆత్మీయ ఆహారం తీసుకోవడం మానేసింది. తన వాక్యాల్ని విని గ్రైకోవాలని ప్రభువు గద్దించాడు. వారికి జ్ఞానముంది గాని చేతలు లేవు. ఈ దుస్థితిలో ఉన్న విశ్వాసులు, సంఘాలు, బలమైన వారిగా ఉండేటట్లు జాగ్రత్తపడదాం. ప్రభువుతో నడుస్తున్నప్పుడు, ఆయన కృపలో ఎదుగుతాం. సంఘాన్ని మృతమైనదిగా కాక సజీవమైనదిగా చేయటానికి ప్రయత్నిద్దాం. వాగ్దానాల్ని స్వతంత్రించుకొందాం. అలా చేయటానికి ఏడాత్ములుగల ప్రభువు సహాయం చేయునుగాక!

---

**14వ పేజీ తరువాయి....**

ఉండి సిలువ చాటున మనలను దాచి వాక్యం అందిస్తాడు– అనిన మాట జ్ఞాపకం వచ్చి నిర్మల్ కుమారుగారి చేతిలో నుండి బైబిలు తీసుకొని ప్రార్థన చేసి వాక్యం చెప్పాను. అది మొదలు రెండు సంవత్సరాలు నేనే క్లాసులో వాక్యం చెప్పాను.

ఒక రోజు కరుణమ్మ అనే ఆంటి ఇంటికి వెళ్ళాను అక్కడ నాకు ఫిట్స్ వచ్చింది. ఆంటి నా చెయ్యి గట్టిగా పట్టుకొన్న పుడు నాలో ఉన్న దురాత్మ మాట్లడింది. నా చెయ్యి విడిచిపెట్టు అంది. కరుణమ్మ ఆంటి – నీవెవరవు ఈ బిడ్డలోనికి ఎందుకు వచ్చావు అని అడిగింది. అప్పుడు నేను రాలేదు. అతనే నాలుగు సంవత్సరాల క్రితం నన్ను కాల్చిన చోట నా గుంతమీద గంటసేపు కూర్చున్నాడు – ఇంకా పదిహేను రోజులకు నాతో ఇతనిని తీసుకొని వెళతాను అని చెప్పింది. అంతలో మా చిన్నన్నయ్య వచ్చాడు. కరుణమ్మగారు మా అన్నయ్యతో బాబు వెంటనే అబ్బాయికి బాప్తిస్మం ఇప్పించండి దేవుని కాపుదలలో ఉంటాడు అని చెప్పింది.

1993 మార్చి 6 తేది. అమరావతి క్రిష్ణా నదిలో సహో. జేమ్స్ రాజరత్నంగారు నాకు బాప్తిస్మము ఇచ్చారు. 1994 ఏప్రియల్ 10 తేది. దేవుడు నన్ను సేవకు పిలిచాడు. నా ద్వారా నా కుటుంబమంత రక్షణలోనికి వచ్చారు. మా అమ్మగారు, మా పిన్ని, మా అక్కలు, మా అన్నలు. అందరూ బాప్తిస్మము తీసుకొని రక్షణలోనికి వచ్చారు. మేమంతా కుటుంబ ప్రార్థన చేసుకోకుండా పండుకోము.

సాక్ష్యము

# నన్ను మార్చిన యేసయ్య

నా పేరు  షేక్ గౌస్ మోహిద్దీన్, మా తండ్రిగారు షేకె హూస్సేన్, మా అమ్మ జేహిరాబి, సొంత ఊరు మాచర్ల. మా తండ్రిగారు కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసరుగా విజయవాడ, గుంటూరులో పనిచేసారు. 1964లో గుంటూరు కొరిటిపాడులో ఒక ఇల్లు కొన్నారు. మేము నాలుగురు మగపిల్లలం ముగ్గురు ఆడపిల్లలు. మా తండ్రిగారు గుండెపోటుతో మరణించారు. అందరిలో నేను చిన్నవాడను, మా తండ్రి మరణాంతరం మమ్మల్ని మా తల్లి ఎంతో కష్టపడి ప్రేమతో పెంచారు.

నేను గుంటూరులో మాజేటి గురవయ్య హైస్కూల్‌లో పది వరకు చదివాను. ట్యూషన్ కోసం కోరిటిపాడులోని రావీంద్ర బాలవిద్యా మందిరము వెళ్ళేవాడిని, మా ట్యూషన్ ప్రక్కనే ఒక చెరువు ఉంది దాని కట్టకు అనుకొని హిందువుల శ్మాశాన వాటిక ఉన్నది. పది చదివేటప్పుడు పరీక్షలలో రాత్రి పూట అక్కడే పండుకోమని మా మాస్టరు చెప్పారు. ఒక రాత్రి ట్యూషన్‌లో ఉండి మూత్ర విసర్జనకై రాత్రి 9 గంటల ప్రాంతములో చెరువుకట్ట మీదకు వెళ్ళాను. అప్పుడు నన్ను ఎవరో తరిమినట్లుగా శ్మశాన వాటికలోనికి వెళ్ళి చిమ్మ చీకటిలో శవాలను కాల్చేచోట గంటసేపు కూర్చున్నాను. నాకు ఏమి భయం అనిపించలేదు. తరువాత ట్యూషన్‌లోనికి వస్తే మా మాస్టరు కోపడ్డాడు – నేను మాట్లాడాలేదు. కాని నా మనస్సు ఏదో మారిపోయింది. చదువు మీద ఆసక్తిపోయింది. నేను చూడడానికి బలంగా ఉన్నా, పుట్టుకలోనే కుడిచేయి, కుడికాలు అవిటిగా పుట్టాను. తరువాత నేను ట్యూషన్ మానివేసి గదిలోనికి వెళ్ళి తలుపుకు గడియ వేసి బీరువాలో డబ్బులు దొంగిలించి ట్యూషన్‌కి వెళ్ళుతున్నానని చెప్పి రోజు సినిమాకి వెళ్ళుతుండేవాడిని, ఇంట్లోవాళ్ళకి ఎవరికి అనుమానం రాలేదు. మూడు వారాల తరువాత మా ట్యూషన్ మాస్టరు ఒక కుర్రవానితో నా సంగతి విచారించి రమ్మని మా ఇంటికి పంపించాడు. నేను మిద్దెమీద నుంచి అతనిని చూచి గబగబ క్రిందికి వచ్చి నీరసంగా నటిస్తూ నాకు మూడు వారాలుగా టైఫాయిడ్ జబ్బు వచ్చింది  అని చెప్పి పంపించాను.

ఒక రోజు మా పిన్ని కూరగాయలకు బజారు వెళ్ళింది. అక్కడ ట్యూషన్ మాష్టరు నా జ్వరం గురించి ఆమెను విచారించాడు. అప్పుడు మా పిన్ని మీ దగ్గరకు రోజు వస్తున్నాడుగా అని అన్నది. దాంతో నా సంగతంతా అందరికి తెలిసిపోయింది. ఈ విధంగా నా చదువు భంగపడి టెన్త్ క్లాసు నాలుగో సంవత్సరంలో కూడ ఒక సబ్జెక్ట్‌లో నిలబడి పోయాను. నా రెండవ అన్న కమర్షియల్ టాక్సస్ ఆఫీసులో పని చేస్తున్నాడు. ఒకరోజు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చినప్పుడు మా ఇంట్లో వారితో నా ప్రవర్తన వల్ల ఆయన ఆఫీసులో తలెత్తుకొని తిరుగలేకపోతున్నానని ఇప్పటికి నాలుగు సంవత్సరాలుగా టెన్త్ పరీక్ష పాస్ కాలేదని ఈ సంవత్సరంకాని ఆ ఒక సబ్జెక్టు పాస్ కాకపోతే నన్ను విజయవాడ క్రిష్ణా నదిలో పడేస్తానని చెప్పాడు. అప్పుడు నాకు చాలా భయం వేసింది.

శారదకాలనిలో మేరిగోల్డు అనే ఆంటి రోజు మా ఇంటి మీదుగా నడిచివెళ్ళేది. ఆమె మా ఇంటి దగ్గరగా వచ్చినప్పుడు ప్రభువు ఆమెతో ఈ ఇంట్లోకి వెళ్ళు ఇక్కడ నా సేవకుడు ఉన్నాడు అని చెప్తుండేవాడు. మేము ముస్లిములము కనుక కొన్ని రోజులు ఆమె మా ఇంట్లోనికి రాలేదు. చివరికి దేవుని యొక్క మాటకి లోబడి మా ఇంటి తలుపు తట్టి లోనికి వచ్చి మా అమ్మతో మాట్లాడి యేసుప్రభువు మీకు తెలుసా! అని అడిగింది. అందుకు మా అమ్మ అమ్మా మేము ముస్లింలము అయిదు పూటల నమాజు చేస్తాము. రంజాన్ సమయములో నలభై రోజులు ఉపావాసం చేస్తాము. యేసు! దేవుని ప్రవక్తే కాని దేవుడు కాడు అని చెప్పింది. ఆ విధంగా వారు మాట్లడుకొంటుంటే నేను లోపల గదిలో ఉండి వింటు న్నాను. ఈ మాటలు విని మా అమ్మతో ఎవరు మాట్లాడు తున్నారో చూడాలని బయటకు వచ్చాను. అప్పుడు ఆంటి నన్ను చూసి ఈ బాబు ఎవరు? అని అడిగింది. మా అమ్మ మా చిన్న కుమారుడు పుట్టుకతోనే కాలు, చెయ్యి అవుడు

చదువన్నా ఉంటే బాగుండును అనుకుంటే ఈ రీతిగా మమ్ములని ఏడిపిస్తున్నాడని నా సంగతాంత ఆమెకు చెప్పి ఏడ్చింది. అప్పుడు ఆంటి అబ్బాయిని నాతో ప్రార్ధనకు పంపించండి తప్పక మార్పు వస్తుంది అన్నది. అందుకు మా అమ్మ మీరు స్వయంగా వచ్చి వెంటబెట్టుకొని తీసుకొని వెళ్ళి మరలా మీరే మా ఇంట్లో వదలాలి అలా అయితే మీరు తీసుకొని వెళ్ళండి అన్నది.

ఒక ఆదివారం ఆంటి నన్ను లూథరన్ చర్చికి తీసుకొని వెళ్ళింది. నాలో దురాత్మ ఉండబట్టి ఆ వాక్యం వినకుండా అటు ఇటు చూస్తుండేవాడిని, ఆంటి నన్ను వినమన్నప్పుడు వింటున్నాను అన్నాను. ఏమి వింటున్నావు? అన్నది. యేసుప్రభువు సిలువలో రక్తం కార్చాడంట! మన పాపాలు పోతాయంటా ఇదేమన్న డిటర్జెంటు కేకా? అని పెద్దగా అన్నాను. ప్రక్కనున్న వాళ్ళు అబ్బాయిని బయటకు తీసుకొని వెళ్ళమ్మ అన్నారు. ఈ రీతిగా మూడు నెలలు ఆంటి నన్ను ఓపికతో చర్చికి తీసుకొనివెళ్ళేది. మా చిన్నన్న నన్ను ఎత్తికెళ్ళి క్రిష్ణ నదిలో పడవేస్తానన్న మాట నన్ను భయపెడుతుండేది.

ఒకసారి ప్రార్ధనలో పాస్టరుగారు వాక్యం చెబుతు "కాబట్టి ఇప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు" రోమా 8 : 1. అనిన మాట నా హృదయంలో నిల్చిపోయింది. నా హృదయంలోనించి ఏదో భయం తొలిగినట్లుగా అనిపించింది. ఇంటికి వచ్చిన తరువాత ఆ సాయంత్రం యేసయ్యతో ఉండాలని నిశ్చయించుకొన్నాను. యేసుప్రభువు దేవుడై ఉంటే నా టెన్త్ క్లాస్ పరీక్ష పాస్ చేయించాలి, నా జీవితం పరిపూర్ణంగా మార్చాలి అనుకొని గదిలోనికి వెళ్ళి తలుపు గడిపెట్టాను. మా అమ్మ వచ్చి తలుపు గడియ తీయమన్నది. బీరువా తాళలు తీసి మా అమ్మకు ఇచ్చి మళ్ళీ తలుపు గడి వేసి నాకు చేతనైన ప్రార్ధన రాత్రాంత చేసాను.

పరీక్షలు ఇంకా ఇరవై రోజులే ఉన్నాయి. చదవటానికి పుస్తకం తెరిస్తే చదువు ఎక్కటం లేదు. ఆ రోజులలోనే దానియేలు అనే ఒక సువార్తికుడు పరిచయమైనాడు. ఆయనతో నా బాధంతా వివరించి ప్రార్ధన చేయమని చెప్పాను. ఆయన ఒక పెన్ను కొని నాకిచ్చి ఈ పెన్నుతోనే నువ్వు పరీక్షలు రాయి నీ పరీక్ష తారీఖులు నాకు తెలియజెయ్యి నువ్వు పరీక్షలు రాసేటప్పుడు నీ కొరకు ఆ రోజులలో ఉపవాస ప్రార్ధన చేస్తాను అన్నాడు. పరీక్ష సమయంలో నేను దేవునితో మూడు ఒడంబడికలు నా హృదయంలో చేసుకున్నాను. 1. పరీక్ష పాసైన తరువాత క్రైస్తవ కళాశాలలోనే చదువుతాను. 2. నీ సేవకుడిని అవుతాను. 3. మా ముస్లింలు నన్నేంత హింసించిన నీలోనే ఉంటాను. పరీక్ష సమయంలో నేను ఏమి రాస్తున్నానో తెలియకుండా రాసాను. ఫలితాలు వచ్చే రోజులలో లక్ష్మి పిక్చర్ ప్యాలెస్‌లో మ్యాట్నికి వెళ్ళాను. సగం ఆట అయిన తరువాత రిజల్టు వచ్చాయని తెలిసి బయట గేటువాని బతిమిలాడి బయటకు వచ్చాను. ఒక చోట జనం గుంపుగా ఉండి రిజల్టు చూస్తున్నారు. నేను నా నంబరు కాగితం మీద రాసి ఇది నా స్నేహితుని నంబరు కొంచెం చూసి పెట్టండి అన్నాను. ఒకతను నంబరు చూసి మీ స్నేహితుడు పాస్ అయ్యాడు అని చెప్పాడు. నేను మరలా నంబరు చూసుకోని ఇంటికి వచ్చి అందరికి చెప్పాను. అందరు నన్ను కౌగిలించు కొని సంతోషంతో ఏడ్చారు. నాకు ఏమి అర్ధం కాలేదు. ఒక పాపి ప్రార్ధన దేవుడు ఆలకించి ఆ రీతిగా పాస్ చేయిస్తాడా అనుకున్నాను.

ఆంధ్ర క్రైస్తవ కళశాలలో అప్లికేషన్ పెట్టాను. నైట్ క్లాసులకు కాలేజిలో సీటు వచ్చింది. మాకు ప్రతిరోజు అరగంటసేపు బైబిల్ క్లాస్ ఉంటుంది. శ్రీ జి. నిర్మల్ కుమారుగారు వాక్యం బోధిస్తారు. ఒకరోజు నేను లేచి నిలవబడి నేను వాక్యం అందిస్తానని చెప్పాను. అందుకు ఆయన నా వైపు చూచి నువ్వు ముస్లింవా? నీకు దేవుని పిలుపు ఉన్నదా? బాప్తిస్మము పొందావా? అన్నాడు. నేను సమాధానం చెప్పలేదు. కాబట్టి ఆయన నన్ను కూర్చోమన్నాడు కాని నేను అలానే నిలబడి ఉన్నాను. ఆయన మరలా నా వైపు చూచి కూర్చోమన్నాడు నేను కూర్చోకుండా అలానే నిలబడి ఉన్నాను అప్పుడు ఆయన నవ్వుతూ నా వైపు చూచి దగ్గరకు వచ్చి వాక్యం చెప్పాలని ఇంట్రస్ట్‌గా ఉన్నదా! నేను నీ ఇంట్రస్ట్‌ని ఎందుకు కాదనాలి. అయితే నువ్వు ఒక కండిషన్‌కి ఒప్పుకుంటే నీతో ఇప్పుడు వాక్యం చెప్పిస్తానన్నాడు. ఇప్పుడు లూకా 5 అధ్యాయం చెప్పాలి, ప్రతిరోజు నువ్వే చెప్పాలి అన్నాడు. అప్పుడు దైవజనుడైన దానియేలుగారు చెప్పిన వాక్యంస చెప్పేవారం మనం కాదు, క్రీస్తే మన లోపల

**...మిగతా 12వ పేజిలో**

# దాతృత్వం

"మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో మీరును వారికి ఆలాగుననే చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునైయున్నది" అని యేసుప్రభువు మత్తయి సువార్త 7వ అధ్యాయం 12వ వచనంలో చెప్పాడు. ఇతరుల నుండి మనం అన్నీ మేలులే ఆశిస్తాము. అన్నీ మనకు అనుకూలంగా జరగాలని కోరుకుంటాము. కాని మనం మాత్రం ఇతరులకు మేలు చేయటానికి మనసు రాదు. దాతృత్వ హృదయం అందరికీ ఉండదు. ధనమును ప్రేమించే వాళ్ళకి అస్సలు ఉండదు. దేవున్ని ప్రేమించే వాళ్ళు తప్పకుండా ఇతరులకి సహాయపడతారు. 2కొరింథీ.8:2లో అపొస్తలుడైన పౌలు మాసిదోనియా సంఘము వారి గురించి చెప్తూ వారు నిరుపేదలైనను వారి దాతృత్వం బహుగా విస్తరించిందని వివరించాడు.

విజయవాడలోని ఒక సహోదరి 'పరిశుద్ధత' మాసపత్రిక గత ఏప్రిల్ నుండి పొందుతూ వుంది. పత్రిక సంవత్సర చందా గురించి అడిగినప్పుడు మనియార్డరు ద్వారా పంపుతాను సార్ అని చెప్పింది. ఎందుకులేమ్మా నేను ప్రతి నెలా పత్రిక ప్రింటింగ్ కోసం విజయవాడ వస్తుంటాను నేను వచ్చినప్పుడు నాకు ఇవ్వు అని చెప్పినప్పుడు, సరే సార్ అన్నది. గత నవంబర్‌లో నేను విజయవాడ వెళ్ళినప్పుడు ఆ సహోదరికి ఫోన్ చేసినప్పుడు ఇంటికి రమ్మని చెప్పింది. అడ్రస్ కనుక్కొని వాళ్ళింటికి వెళ్ళాను. అక్కడ ఇళ్ళన్నీ చిన్నవిగా రేకుల కప్పుతో ఉన్నాయి. చూడగానే వీళ్ళు చాలా పేదవాళ్ళు అనుకున్నాను. వాళ్ళ ఇంట్లోకి కూడా వెళ్ళలేదు రోడ్డు మీద ఉండగానే సహోదరి చందా తీసుకొచ్చి ఇచ్చింది. సంవత్సర చందా 150/- కంటే ఎక్కువ కట్టలేదేమో అనుకున్న. ఎందుకంటే అంతకుముందు ఒకసారి ఫోన్ చేసినప్పుడు ఆర్థిక ఇబ్బందుల గురించి ప్రార్థించమని చెప్పింది. కాని సహోదరి ఇచ్చిన చందా లెక్కపెట్టినప్పుడు 1000/- రూపాయలు ఉన్నాయి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇన్ని ఆర్థిక ఇబ్బందుల్లో కూడా దేవుని కొరకు త్యాగం చేసేంత దాతృత్వ హృదయం సహోదరి కలిగి వుండటం చాలా గొప్ప విషయం. తరువాత మార్చి నెలలో మరలా విజయవాడ వెళ్ళినప్పుడు ఉదయం టిఫిన్ చేయడానికి కుదరలేదు. టైం ఉదయం 10 దాటింది. ఎక్కడైనా హోటల్లో టిఫిన్ చేద్దామంటే, నేను వెళ్ళిన ప్రదేశంలో హోటల్స్ లేవు. అప్పుడు సహోదరికి ఫోన్ చేశాను. ఇంటికి రమ్మంది. నాతోపాటు ఇంకొకరు కూడా ఉన్నారు. మేమిద్దరం వాళ్ళింట్లోకి వెళ్ళాము. వాళ్ళ ఇల్లు చూసి చాలా ఆశ్చర్య పోయాను. ఒకే ఒక్క గది. ఆ గదిలో ఒక మంచము మాత్రమే పడుతుంది. మంచం పక్కన కొంచెం స్థలంలో వంట చేసుకోవడం. ఆ గది వెడల్పు 6 అడుగులు, పొడవు 10 అడుగులు ఉంటుంది. చాలా చిన్న గది. ఆ గదిలో భార్య, భర్త, ఇద్దరు చిన్నపిల్లలు ఉంటారు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, పేద విధవరాలు కానుకల పెట్టెలో తన దగ్గరున్న 2 కాసులు వేసి యేసు ప్రభువు దృష్టిలో పడింది. యేసుప్రభువు నుండి మెప్పును పొందింది. ధనవంతులు అనేకులు వాళ్ళకున్న సమృద్ధిలో నుండి వేశారు కాని, ఈమె తన లేమిలో నుండి తన జీవనమంతయు వేసెను అని సాక్ష్యమిచ్చాడు. మా పరిశుద్ధత మాసపత్రిక పాఠకులలో ఎంతోమంది ధనవంతున్నారు. చందా విషయం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎవ్వరూ స్పందించటం లేదు. సంవత్సరానికి 200/- రూపాయలు కట్టలేనంత పేద స్థితిలో ఎవ్వరూ ఉండరు. కేవలం ఇచ్చే మనసు లేకపోవడమే వారి స్థితి. పరలోకమందు ధనము కూర్చుకోవడమంటే దేవుని కొరకు ఖర్చు చేయడమే. డబ్బున్న పేదలకి దాతృత్వ హృదయం రావాలని ప్రార్థిద్దాం.

# బైబిలు కథలు - యాకోబు

పిల్లలూ బాగున్నారా? వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి కదా! మరి ఈ వేసవి సెలవులలో ఏం చెయ్యా లనుకుంటున్నారు. చాలామంది వేరే ఊర్లలో ఉన్న బంధు వుల ఇళ్ళకు వెళ్తుంటారు కదా! ఎప్పుడు సెలవులు వచ్చినా బంధువుల ఇళ్ళకు వెళ్లటం నా చిన్నతనం నుండి చూస్తు న్నాను. మరి ఈ సెలవులను మనం దేవునికి ఇష్టంగా గడిపితే దేవుడు మనకి బోలెడన్ని ఆశీర్వాదాలు ఇస్తాడు కదా! అయితే మీరు ఈ సెలవులలో బైబిల్‌ను ఒకసారి పూర్తిగా చదవండి. అంటే ఆదికాండం 1వ అధ్యాయం నుండి ప్రకటన 22వ అధ్యాయము వరకు రోజుకి 30 అధ్యాయాలు ఉదయం 10 మధ్యాహ్నం 10 రాత్రికి 10 చద వండి. మీ సెలవులు పూర్తి అయ్యే సరికి మీరు బైబిల్ పూర్తిగా చది వేస్తారు. మీ తల్లిదండ్రులు బైబిలు పూర్తిగా ఒకసారన్నా చదివేరో లేదో కాని మీరు చదివితే మాత్రం వాళ్ళు కూడా సంతోషిస్తారు. దేవుడైతే ఇంకా సంతోషిస్తాడు. మరి మీరు దేవున్ని సంతోషపెట్టడానికి రెడీయేనా? మరి మనం కథలోకి వెళ్దాము.




యాకోబు కల కన్నాడని తెలుసుకున్నాము కదా! అప్పుడు యాకోబు తాను కలగన్న ఆ ప్రదేశానికి 'బేతేలు' అని పేరు పెడతాడు. అక్కడ నుండి బయలుదేరి తన మేనమామ లాబాను ఊరైన పద్దనరాము వెళ్తాడు. అక్కడ ఊరి బయట ఒక బావి కనిపిస్తది. అక్కడ కొంతమంది గొఱ్ఱెల కాపరులు తమ గొఱ్ఱెలకు నీళ్ళు పెట్టడానికి వస్తారు. అప్పుడు యాకోబు వాళ్ళతో "అన్నలారా, మీరు ఎక్కడి వారు" అని అడిగినప్పుడు "మాది హారాను" అని చెప్తారు. అప్పుడు యాకోబు "మీకు నాహోరు కుమారుడైన లాబాను తెలుసా?" అని అడిగినప్పుడు వారు "మాకు తెలుసు, ఇదిగో ఆయన కుమార్తె గొఱ్ఱెలు మేపుటకు ఇక్కడికి వచ్చి యున్నది" అని చెప్తారు. అంతలో లాబాను కుమార్తెయైన రాహేలు గొఱ్ఱెలు మేపుకుంటూ ఆ బావి దగ్గరకు వస్తుంది. యాకోబు ఆమెను చూచినప్పుడు బావి మీద రాయిని తీసి రాహేలు గొఱ్ఱెలకు నీళ్ళు పెట్టి, రాహేలును పట్టుకొని పెద్దగా ఏడుస్తాడు. తర్వాత తాను ఆమె తండ్రి బంధువునని రిబ్కా కుమార్తెనని చెప్పినప్పుడు రాహేలు పరుగెత్తుకుంటూ వెళ్ళి తన తండ్రితో చెప్తుంది. అప్పుడు లాబాను పరుగెత్తుకుంటూ వచ్చి యాకోబును కౌగలించుకొని ముద్దు పెట్టుకొని తన యింటికి తీసుకొని వెళ్తాడు. యాకోబు లాబాను ఇంట్లో ఒక నెల రోజులు ఉన్న తర్వాత లాబాను యాకోబుతో "నువ్వు నా యింట్లో ఊరికే పని చేస్తావా? నీకెంత జీతము కావాలో అడుగు" అని అంటాడు. లాబానుకి ఇద్దరు కుమార్తె ఉంటారు. పెద్దదాని పేరు లేయా. ఆమె జబ్బు కళ్ళది. రెండవదాని పేరు రాహేలు. ఆమె చాలా అందంగా ఉంటుంది. అప్పుడు యాకోబు లాబానుతో "నీ చిన్నకుమార్తెయైన రాహేలు కోసం నీకు ఏడు సంవత్సరాలు కొలువు చేస్తాను" అని చెప్తాడు. అప్పుడు లాబాను "సరే, ఆమెను పరాయి వాడికి ఇవ్వడం కంటే నీకివ్వడం మంచిది, నా దగ్గర వుండు" అని చెప్తాడు. రాహేలును ప్రేమించడం వలన యాకోబుకు ఏడు సంవత్సరాలు కొన్ని రోజులుగానే అనిపిస్తాయి. తర్వాత యాకోబు తన మామయైన లాబానుతో నా ఏడు సంవత్సరాలు పూర్తి అయ్యాయి కాబట్టి రాహేలును ఇచ్చి

పెండ్లి చెయ్యమని అడుగుతాడు. అప్పుడు లాబాను అక్కడ మనుష్యులందరిని పిలిపించి విందు చేయించి, రాత్రివేళ రాహేలుకు బదులుగా లేయాను యాకోబు దగ్గరకు పంపిస్తాడు. లేయాకు దాసిగా జిల్పాను ఇస్తాడు. ఉదయం నిద్రలేచినప్పుడు ఆమె లేయాగా గుర్తించి తన మామయైన లాబాను అడుగుతాడు రాహేలుకు బదులుగా లేయాను ఎందుకు పంపించావు నేను రాహేలు కోసమే కదా నీ దగ్గర పని చేశాను అని. అప్పుడు లాబాను "పెద్దదాని కంటే ముందు చిన్నదానికి పెండ్లి చేయటం మా దేశ సాంప్రదాయం కాదు. నువ్వు ఇంకో ఏడు సంవత్సరాలు నా దగ్గర పనిచేస్తే అప్పుడు రాహేలును నీకు ఇస్తాను" అని చెప్తాడు. అందుకు యాకోబు ఒప్పుకోవడంతో వారం రోజుల తర్వాత రాహేలును కూడా యాకోబుకు ఇస్తాడు. రాహేలుకు బిల్హా అనే దాసిని ఇస్తాడు లాబాను.

అయితే యాకోబు లేయాకంటే రాహేలు ఎక్కువగా ప్రేమిస్తాడు. లేయా ద్వేషింపబడటం దేవుడు చూచి ఆమెకు పిల్లలను ఇస్తాడు కానీ రాహేలుకు ఇవ్వడు. రాహేలు గొడ్రాలై ఉంటది. లేయాకు నలుగురు పిల్లలు పుడతారు. పెద్దవాడి పేరు రూబేను, రెండవ వానిపేరు షిమ్యోను, మూడవ వానిపేరు లేవి, నాల్గవ వానిపేరు యూదా.

అప్పుడు రాహేలు యాకోబుతో "నాకు గర్భఫలమిమ్ము, లేదంటే నేను చచ్చిపోతాను" అని గొడవ పెట్టుకుంటది. యాకోబు ఆమెతో, "నీకు పిల్లలను ఇవ్వడానికి నేనేమైనా దేవుడినా?" అని కోప్పడతాడు. అప్పుడు రాహేలు "అయితే నా దాసియైన బిల్హాని పెండ్లిచేసుకో, ఆమెకు పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అవుతారు అని చెప్తుంది. అప్పుడు యాకోబు రాహేలు మాట ప్రకారం బిల్హాని పెండ్లి చేసుకుంటారు. తర్వాత బిల్హాకి ఇద్దరు పిల్లలు పుడతారు. వారికి దాను, నఫ్తాలి అని పేర్లు పెడతారు. లేయాకి కానుపు ఉడికిపోవడంతో, రాహేలుకు పోటీగా తన దాసియైన జిల్పాని యాకోబుకి భార్యగా ఇస్తుంది. జిల్పా యాకోబుకు ఇద్దరు పిల్లలను కంటుంది. వారికి గాదు, ఆషేరు అని పేర్లు పెడతారు.

ఒకరోజు లేయా కుమారుడైన రూబేను పొలము వెళ్తాడు. అక్కడ పుత్రదాత వృక్ష ఫలములు చూచి తన తల్లియైన లేయాకు తెచ్చి ఇస్తాడు. అప్పుడు రాహేలు అక్కతో "నీ కుమారుడు తెచ్చిన పుత్రదాత వృక్షఫలములలో కొన్ని నాకు ఇస్తావా?" అని అడుగుతుంది. అప్పుడు లేయా "నా భర్తను తీసుకున్నావు కదా, అది చాలదా? ఇప్పుడు నా కుమారుని పుత్రదాతవృక్ష ఫలాలు కావాలా?" అని అంటుంది. అప్పుడు రాహేలు అయితే నాకు కొన్ని పండ్లు ఇస్తే ఈ రోజు నా భర్తని తీసుకో అని చెప్తుంది.

సాయంత్రం యాకోబు పొలము నుండి వచ్చేటప్పుడు లేయా అతనికి ఎదురు వెళ్ళి ఈ రోజు నువ్వు నాతో ఉండాలి, నా కుమారుని పుత్రదాతవృక్ష ఫలాలతో నిన్ను కొన్నాను అని చెప్పి యాకోబుని తన యింటికి తీసుకొని పోతుంది. తరువాత లేయాకి ముగ్గురు పిల్లలు పుడతారు. ఇద్దరు కుమారులు ఒక కుమార్తె. ఐదవ కుమారునికి ఇశ్శాఖారు అని, ఆరవ కుమారునికి జెబూలూను అని, కుమార్తెకు దీనా అని పేర్లు పెడుతుంది. లేయాకి మొత్తం ఏడుగురు పిల్లలు. ఆరుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల.

రాహేలుకి పిల్లలు లేకపోవడం వలన పిల్లల కోసం దేవునికి ఎంతో మొర్రపెట్టుకుంటది. దేవుడు రాహేలు మొర్ర విని ఆమె గర్భము తెరుస్తాడు. అప్పుడు ఆమె ఒక కుమారుని కని అతనికి యోసేపు అని పేరు పెడుతుంది. రాహేలు యోసేపును కనిన తరువాత యాకోబు లాబానుతో "నన్ను పంపివేయుము. నా భార్య పిల్లలతో నేను మా దేశము వెళ్ళిపోతాను. ఇప్పటి దాకా నేను నీ దగ్గర కొలువు చేశాను కదా" అని అంటాడు. అప్పుడు లాబాను "నిన్ను బట్టి యెహోవా నన్ను ఆశీర్వదించాడని శకునము చూచి తెలిసుకున్నాను. నీకెంత జీతము కావాలో అడుగు ఇస్తాను" అని అంటాడు.

పిల్లలూ! మిగతా కథ వచ్చే నెలలో చెప్పుకుందాము. మరి ఈ వేసవి సెలవులలో మీరు బైబిలంతా చదివేస్తారు కదా! మీరు దేవుని కోసం ఈ పని చేస్తే దేవుడు మిమ్మల్ని గొప్పగా ఆశీర్వదిస్తాడు. మీ తెలివితేటలను అధికం చేస్తాడు. "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము" (సామెతలు 1:7)

సాక్ష్యము

# బండకింద ఉన్న ఓ పావురమా!

నా పేరు పరస బుచ్చయ్య. తల్లి కోటమ్మ, తండ్రి నాగూర్‌బాబు. నరసారావుపేట వాస్తవ్యులు. ఆదినుంచి గౌడ కులానికి సంబంధించిన వాళ్ళం. స్వగ్రామం చిలకలూరిపేట. అయితే మా నాన్న గారిది చిలకలూరిపేట., అమ్మగారిది నరసారావుపేట. మా నాన్నగారు చనిపోతే మమ్మల్ని నరసారావుపేట. తీసుకొని వచ్చారు మా పెదనాన్నగారు. వీరంతా విగ్రహారాధికులు. ఆ రోజుల్లో ప్రతి గుడిలో 116రూ. 1016రూ. కడుతూ ఉండేవారు. నేను కూడా శివునికి, షిరిడి సాయిబాబాకి మొక్కుతూ ఉండేవాడ్ని. వీళ్ళు ఎలా చేస్తున్నారో నేను అలానే ఉన్నాను.

ఒకటవ తరగతి నుంచి ఏడు వరకు మునిసిపల్ హైస్కూల్ నరసారావుపేటలో చదివాను. డిగ్రీ యస్.యస్.ఎన్. కళాశాలలో చేరి యన్.సి.సి.లో చేరి అండర్ ఆఫీసర్‌గా చేస్తూ కాశ్మీర్ మరియు లోకల్‌లో కూడా క్యాంప్, ఆల్‌ఇండియా సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్ నిమిత్తం కాశ్మీర్ వెళ్ళాను. భయంకరమైన చలిలో కూడా వారు పెట్టిన నియమాలను పాటించాను. రూరల్ ఆఫీసర్‌గారు వెంటనే రిక్రూట్‌మెంట్ చేసుకోవడానికి రమ్మన్నారు. నా తల్లిగారికి నేను ఒక్కడినే కుమారున్ని కాబట్టి ఆమె భయపడి వద్దు అనినది. కానీ జనరల్ మేనేజరుగారు నీకు కుదిరితే రమ్మన్నారు. ఏడవ ఫారం చదివేకాలంలో విడుతూరి సూర్యంగారి ఆధ్వర్యంలో వజ్రాలు వనితలు, కుక్కలున్నాయిజాగ్రత్త అను రెండు సినిమాలలో నటించుటకు నన్ను పిలిపించినప్పటికీ నా తల్లిగారు నిరాకరించడం వలన నేను వెళ్ళలేకపోతిని. ఈ విధంగా ఎంతో విలువైన రెండు సందర్భాలను పోగొట్టు కున్నాను. బాల్యం నుండి కూడా శివుడు, షిరిడి సాయిబాబా అను దేవుళ్ళను ఇష్టంగా ప్రతిరోజు పూజిస్తూ ఉండేవాన్ని. బ్రాహ్మణ పూజారిగారు అయిన నరసింహారావుగారి దగ్గర అర్చకత్వం కూడా నేర్చుకున్నాను. మంత్రాలలో నేను ప్రావీణ్యం పొందాను. ప్రతిరోజు ఉదయాన్నే జపాలు చేస్తూ ఉండేవాడ్ని. ఈ విధంగా నా కాలాన్ని గడుపుతూ ఉండేవాన్ని. నా డిగ్రీ పూర్తి చేసుకున్న తరువాత ఆర్.టి.సి.లో కండక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించాను. బ్రాహ్మణ పూజారులు ఏవిధంగా అయితే వాళ్ళ శరీరానికి గంధకాలు, విభూధి బొట్టు పెట్టుకొనే వాళ్ళో అలా నేను కూడా పెట్టుకొనేవాడ్ని. ఏడవ ఫారం పూర్తి అయిన తరువాత తల్లిదండ్రులు నిశ్చయించిన అమ్మాయితో వివాహం జరిగింది. గుంటూరు కాపురస్తులు తుల్లూరి రాములుగారి ప్రధమ కుమార్తె కృష్ణ కుమారితో నాకు వివాహం జరిగింది. మా అత్తగారి పేరు కోటేశ్వరమ్మ. మాకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్దకుమార్తె నాగమణి, రెండవ కుమార్తె నాగలక్ష్మి, కుమారుడు నాగూర్‌బాబు, మూడవ కుమార్తె జ్యోతి.

వీరు చదువుతున్న సమయంలో నాకు ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే నా దినచర్య చేస్తున్న సమయంలో దోమకాటు వలన నా కుడి చేతికి బోదవ్యాధి వచ్చినది. దీని వలన విపరీతమైన జ్వరం వస్తూ ఉండేది. నా పైఅధికారికి సెలవు కొరకు అర్జీ పెట్టాను. పైఅధికారి నిర్లక్ష్యం వల్ల నా అర్జీని పైఅధికారులకు పంపించ కుండా పోగొట్టారు. ఆ అర్జీ పోయిన సమయంలో నేను దేవుని యొక్క దర్శనాన్ని చూడటం జరిగింది. ప్రతి రోజు దినచర్యలో భాగంగా నా ఇష్టదైవాల ముందు అర్చన కోసం కర్పూరం వెలిగించడానికి అగ్గిపెట్టె కోసం చూస్తుంటే క్రొత్త నిబంధన కనపడింది. అది చూసి చాలా కోపంతో ఎవరు ఇక్కడ పెట్టింది దీనిని? అని నా కుమారుడ్ని పిలిచి పారేయ్ మని చెప్పాను. అయితే దానిని తన జేబులో పెట్టుకున్నాడు నా కుమారుడు. వెంటనే దానిని తన దగ్గర నుండి తీసివేసి చెత్తకుప్పలో పడవేశాను. అది పారవేసిన కొద్ది రోజుల తరువాత నేను నిద్రపోతుండగా దేదీప్యమైన కాంతిని చూడటం జరిగింది. ఆయన నా వైపే చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నాడు. చూడగానే నా ఆత్మ గుర్తించింది ఈయన యేసుప్రభువు అని. కానీ నేను "నా ఇష్టదైవం శివుడు, షిరిడీ సాయిబాబా కదా! నీవు కనబడ్డావు ఏంటి?" అని అడిగాను. కానీ ఆయన నా వైపు చూస్తూ నవ్వుతున్నాడు. కానీ నేను లేవలేకపోయాను. నా నోటి నుండి మాట కూడా రాలేదు. ఇది ఎంతసేపు జరిగిందో తెలీదు కానీ నేను ఆ సమయంలో ఏమీ చేయలేక పోయాను. దర్శనం అయిపోయిన వెంటనే

సాష్టాంగపడి నమస్కరిద్దాం అని అనుకున్నాను. కానీ మోకరించి సాష్టాంగపడదాము అనే సరికి నేను మోకాళ్ళ దగ్గరే ఆగిపోయాను.

ఇది జరిగిన కొద్ది రోజులకు మా ఇంటి దగ్గర ఉన్న క్రైస్తవ విశ్వాసి అయిన వీరయ్యగారి దగ్గరకు వెళ్ళాను. అతనితో నాకు కలిగిన దర్శనమును చెప్పి, నా ఆత్మ చర్చీకి వెళ్ళు అని అంటుందండి అని చెప్పాను. కానీ నాకు సిగ్గుగా ఉండి వెళ్ళలేకపోయాను. దీనికిముందు నాలుగు ఆదివారాలు చర్చీకి వెళ్దాం అని బయలుదేరి అక్కడ చర్చీ చుట్టూ తిరిగి వచ్చేవాన్ని. వీరయ్యగారు నన్ను తీసుకొని వెళ్ళి టౌన్ చర్చ్ పాస్టర్ గారికి (జె.యం.ప్రకాశ్‌రావు) గారికి నన్ను పరిచయం చేశారు. ప్రభువును చూశాను అని నేను చెబితే ఆయన నమ్మలేదు. అప్పటికి నా శరీరం అంతా విభూధి నామాలు చూసి నమ్మలేకపోయాడు. ప్రక్కనే ఉన్న నన్ను ఎరిగిన ఒక విశ్వాసి నా గురించి చెప్పటంతో అప్పుడు అంగీకరించారు. పాస్టర్‌గారు "ప్రతిరోజు వచ్చి ఇక్కడ ఉన్న కరపత్రికలు చదువుతూ ఉండు" అని నాకు చెప్పాడు. ఆ విధంగా చేస్తూ ఉండగా ఒక మిత్రుడు బాప్తిస్మం తీసుకోవాలి అని చెప్పాడు. నేను ఉన్న పరిస్థితులను చూసి పాస్టర్‌గారు కొన్నిరోజులు ఆగమని చెప్పారు. ఆ సమయంలో బాప్తిస్మమునకు సిద్ధపడు తున్నాను. ఆ రోజు బాప్తిస్మమునకు సిద్ధపడి స్థానిక టౌన్ చర్చ్‌లో జె.యం. ప్రకాశ్‌రావు గారి దగ్గర నేను బాప్తిస్మమును పొందాను. బాప్తిస్మము తీసుకొని పైకి వస్తుండగా ఇంతకు ముందు చూసిన దర్శనం మరోసారి కనబడింది. మహా తేజస్సును మరలా చూడగలిగాను. ఆనాటి నుండి నేటివరకు ప్రభువును స్తుతిస్తూ ఆయన సేవలో కొనసాగుతున్నాను.

మరియొక సందర్భంలో బాప్తిస్మమునకు ముందు నందిగం ఆశీర్వాదంగారు ఒక బైబిల్ ఇచ్చారు. అది తీసుకొని ఇంట్లో పెట్టాను. ఒకానొక రోజు ఆదికాండం మొదటి అధ్యాయం చదువుతూ నిద్రపోయాను. ఆ నిద్రలో గంభీరమైన స్వరం నేను వినగలిగాను. అది ఏమిటంటే 'బండ క్రింద ఉన్న ఓ పావురమా!' అనే స్వరం. నాకు రెండుసార్లు వినబడింది. అదేమిటో అని ఉలిక్కిపడి చూస్తూ బయటికి వచ్చి బజారులో చూశాను. మా వీధిలో ఎవరబ్బా ఇంత స్వరం ఉన్నవాళ్ళు? అని చూశాను. కానీ నాకు ఎవరూ కనపడలేదు. అప్పుడు మాటల గురించి పదేపదే ఆలోచించ సాగాను. అది దేవుని స్వరం అని అర్థం అయింది.

ఒకసారి మా ఇంటి దగ్గరలో ఉన్న వీరయ్యగారు వేరే ఊరు వెళుతూ వారి ఇల్లు చూడమని చెప్పి నాకు ఒక పత్రిక ఇచ్చారు. అది చదువుతూ నిద్రపోయాను. స్వప్నంలో పరలోకం నుండి దేవదూతలు క్రిందకి దిగుతూ, పైకి వెళుతూ దేవుని గాన ప్రతిగానాలతో స్తుతిస్తూ ఉన్నారు. అలాంటి ఆరాధన నేనెప్పుడూ చూడలేదు. ఈ విధంగా దేవుడు, మహా దర్శనాన్ని నాకు చూపిస్తూ సేవ కొరకై నన్ను పిలుస్తున్నాడు. అప్పటికి నేను ఆర్.టి.సి. డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాను. ఈ విషయం నా కుటుంబం వారితో చెప్పాను. వారు అంగీకరించలేదు. చాలా బాధపడ్డారు కూడా! కానీ దేవుడు పదే పదే పిలుస్తూ ఉండటంతో నా ఉద్యోగాన్ని వదిలి సేవకొరకై వచ్చాను. యన్.ఆర్.టి.లోని కొంతమంది దైవ ప్రజలతో కలసి దేవుడు నాకిచ్చిన స్వరాన్ని వినియోగించుకొని పాటలు పాడుతూ దేవుని సువార్తను చాటుతూ ఉన్నాను. ఇక్కడ నా ద్వారా అనేకమంది రక్షణలోకి వచ్చారు.

నేను ప్రభువును అంగీకరించిన తర్వాత నా కుటుంబీకులు కూడా ఒక్కొక్కరు దేవుడ్ని స్వీకరించడం జరిగింది. మొదట నా తల్లిగారు విశ్వసించారు. ఈ విధంగా నా కుటుంబము అంతా ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించారు. దేవుడు నాకు అనుగ్రహించిన భారాన్నిబట్టి 1000 మందిని రక్షణలోనికి రప్పించాలనుకున్నాను. ఇప్పటికి నేను 800ల మందికి పైగా రక్షణ పొందేలా చేసాను. నా గురించి ప్రార్థన చేయండి.

నా యవ్వన ప్రాయంలో దురలవాట్లకు బానిసనయ్యాను. విపరీతంగా త్రాగేవాడ్ని. రోజుకు 30 కారాకిల్లీలు నమిలేవాడ్ని. పేకాట ఆడేవాడ్ని. టౌన్‌లో ఉన్న పెద్ద పెద్ద మిత్రులతో కలసి మద్యపానం సేవించేవాళ్ళం. మా అమ్మగారు చుక్కగారెల వ్యాపారం చేసేది. 1977వ సంవత్సరంలోనే రోజుకు 2000 రూపాయల వ్యాపారం చేసేవాళ్ళం. ఒక్కడినే కుమారుడను కాబట్టి చిన్నతనంలో తండ్రిని కోల్పోవడం వల్ల అల్లారు ముద్దుగా పెంచారు. వారిచ్చిన డబ్బును, ఆస్తిని కూడా త్రాగుడువల్ల అంతా పోగొట్టుకున్నాను. అట్లాంటి పరిస్థితిలో ప్రభువు నాకు దర్శనం రీతిలో కనబడి పాపాంధ కారంలో ఉన్న నన్ను, నా కుటుంబాన్ని రక్షించి, సంరక్షిస్తున్నాడు. నా కుటుంబం అంతా కూడా ప్రభువును విశ్వసించారు. ఇంతకంటే ఈ లోకంలో నాకు కావాల్సింది ఇంకేమీ లేదు. దేవుడు మంచి ఆరోగ్యమిచ్చి నిలువబెడితే మరి ఎక్కువగా సేవ చేయాలని ఆశిస్తున్నాను. నా గురించి ప్రార్థన చెయ్యండి.

# లోకంతీరు

(పుట్టుక చావు మధ్య సంబరం)

## పుట్టుక

**"నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి నా తల్లి గర్భమందు నన్ను నిర్మించిన వాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయ మును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్యకరములు. ఆ సంగతి నాకు బాగుగా తెలిసియున్నది. నేను రహస్యమందు పుట్టిననాడు భూమి యొక్క అగాధ స్థలములలో విచిత్రముగా నిర్మింపబడిన నాడు నాకు కలిగిన యెముకలును నీకు మరుగైయుండ లేదు. నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను. నియమింపబడిన దినములలో ఒకటై నను కాక మునుపే నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితములాయెను" కీర్తనలు 139:13,14.**

> **పుట్టుక**
>
> **దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

భూమి మీద పుట్టిన ఏ మనిషి తన పుట్టుక గురించి కాని, తన చావు గురించి కాని ఎక్కువగా ఆలోచించడు. చావు అంటే భయంతో అప్పుడప్పుడన్నా చావు గురించి ఆలోచిస్తారేమోగాని, పుట్టుక గురించి ఆలోచించేవారు చాలా అరుదు. పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపు కుంటారు కాని, తన పుట్టుక గురించి లోతుగా ఆలోచించరు. అద్దంలో తన ముఖాన్ని చూసి తన అందానికి మురుసు కుంటారు కాని, తన శరీర నిర్మాణాన్ని గురించి ఎవరూ ఆలోచించరు. పై వచనాన్ని మనం పరిశీలనాత్మకంగా మనం గమనించినట్లయితే, దావీదు మహారాజు తన పుట్టుక గురించి ఎంతో లోతుగా పరిశీలించినట్లు గమనించగలం. ***"నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి, నా తల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే"*** అని తన పుట్టుకకు కారణం దేవుడే అని గ్రహించాడు. ఈ శరీరము యొక్క నిర్మాణాన్ని గురించి, అంతరింద్రియములను గురించి ఆలోచించాడు దావీదు. ఆయన గొప్ప మహారాజు. అంతటి గొప్ప రాజు గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించి, విలాసవంతమైన జీవితం జీవిస్తూ, తన భార్యలతో సుఖ సంతోషాలతో మునిగి తేలుతూ ఉండాలి కాని, ఇలా తన పుట్టుక గురించి, తన శరీరం లోని అంతరింద్రియాలను గురించి ఆలో చించటమేంటి? ఆయనకు అంత అవసరం ఏమొచ్చింది?


మీరెప్పుడైనా మీ జీవితకాలంలో ఒక్కసారైనా మీ పుట్టుక గురించి సీరియస్‌గా ఆలోచించారా? మీ శరీర నిర్మాణము గురించి ఆలోచించారా? దావీదు చెప్పినట్లు ***"నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయ మును ఆశ్చర్యమును పుట్టుచున్నవి, అందునుబట్టి నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను"*** అన్నట్లు మీరు ఎప్పుడైనా భావించారా? ఒకవేళ మీరు మీ శరీర నిర్మాణము గురించి తెలుసుకోగలిగితే నిజంగానే మీరు దావీదువలె దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తారు. ప్రతి ఒక్కరూ వాళ్ళు పుట్టిన రోజు నుండే తేది లెక్కిస్తారు. కాని వాళ్ళు వారి తల్లి గర్భమందు ఎప్పుడు ప్రవేశపెట్టినది ఎవ్వరికీ తెలియదు. అది రహస్యం. అందుకే దావీదు ***"నేను రహస్యమందు పుట్టిననాడు"*** అని అన్నాడు. అంటే మన పుట్టుక రహస్యం. అది దేవునికే తెలుస్తుంది తప్ప, మనల్ని కన్న మన తల్లిదండ్రులకి డాక్టర్లకి కూడా తెలియదు.

కంటికి కనబడనంత చిన్న కణం రూపంతో మనం తల్లి గర్భములోకి ప్రవేశిస్తాము. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, మనతో పాటు తల్లి గర్భంలోకి ప్రవేశించడానికి కొన్ని కోట్ల కణాలు పోటీ పడతాయి.



తల్లి గర్భములోకి ప్రవేశించక ముందు మన రూపం ఇలా ఉంటుంది. మైక్రోస్కోపులో చూస్తే తప్ప మామూలు కంటికి ఇవి కనబడవు. తల, తోక అన్నట్లు కనిపిస్తుంది ఈ కణము. ఇలాంటివి కొన్ని కోట్ల కణాలు తండ్రి నుండి విడుదల కాబడినప్పుడు, అవి తల్లి అండములోనికి ప్రవేశించడానికి పోటీ పడతాయి. అయితే తల్లి అండము ఒక్క కణానికి మాత్రమే అవకాశం ఇస్తుంది. కొన్ని సందర్భాల్లో రెండు కణాలు కూడా వెళ్తాయి. ఆ కణాలే కవలలుగా రూపుదిద్దుకుంటాయి. మిగిలిన కణాలన్నీ చనిపోతాయి. కణాలు అంటే మనలాగా మనుషులుగా పుట్టాల్సినవే. అయితే దేవుడు తన కృపను బట్టి, తన చిత్తాన్నిబట్టి మనకు మాత్రమే తల్లి గర్భములోనికి ప్రవేశించే ఆవకాశం ఇచ్చాడు. గర్భఫలము దేవుడిచ్చు బహుమానమైతే, నువ్వు నేను దేవుని యొక్క బహుమానాలు అని మనం గ్రహించాలి.

ఇలా తల్లి గర్భములోనికి ప్రవేశించిన ఆ ఒక్క కణము, కణ విభజన ద్వారా అంటే ఒక్క కణము రెండుగా, రెండు నాలుగుగా, నాలుగు ఎనిమిదిగా, ఎనిమిది పదహారుగా విభజించుకుంటూ పిండముగా రూపుదిద్దుకుంటుంది. అలా రూపుదిద్దుకున్న పిండము తొమ్మిది నెలల వరకు అవయవాలను సంతరించుకుంటూ మనిషిగా భూమ్మీదకు వస్తుంది.



కొన్ని కోట్ల కణాల త్యాగ ఫలితమే ఈ మనిషి జన్మ. చాలామంది మనుష్యులు దేవుడిచ్చిన ఈ మనిషి జన్మకి ఉన్న విలువ తెలీక 'నేను ఎందుకు పుట్టానురా బాబూ, పుట్టకపోయినా బాగుండు' అని అనాలోచితంగా మాట్లాడతారు. మనతో పాటు ప్రవేశపెట్టబడిన ఎన్నో కోట్లమంది మనుష్యులని కాదని మనకి మాత్రమే అవకాశం ఇచ్చి ఈ భూమి మీదకి తీసుకొచ్చిన దేవుని యొక్క చిత్తాని గ్రహించలేనివాళ్ళు మాత్రమే అలా మాట్లాడతారు. కొన్ని కోట్ల మందిని (కణాలను) కాదని నిన్ను, నన్ను మాత్రమే ఈ భూమి మీదకి తీసుకురావడానికి దేవుని మన పట్ల ఎలాంటి ప్రణాళిక లేకుండానే ఉంటుందా? ఈ భూమ్మీద సుఖ సంతోషాలు అనుభవించి, ఈ లోకానుసారమైన జీవితం జీవించటానికే మనకి పుట్టుకను ఇచ్చాడా? **(సశేషం)**

## 2017 చందా వివరాలు

**సంవత్సర చందా రూ. 200/- లు పోషక చందా చందా రూ. 1500/- లు**

**జీవిత చందా రూ. 5000/- లు**

**ప్రేరేపణ చందా రూ. 200 లు పైన ఎంతైనా పంపవచ్చును**


పేపరు, ప్రింటింగ్ చార్జీలు, పోస్టల్ సర్వీస్ చార్జీలు పెరిగినందు వలన పత్రిక చందాను కూడా పెంచడమైనది. పాఠకులు సహృదయముతో అర్థము చేసుకొని సహకరించవలసినదిగా ప్రభువు నామమున కోరుచున్నాము. **-ఎడిటర్**

## ఈ నెల ప్రశ్న - మే-2017

**మోషే తల్లియైన యోకెబెదు తండ్రి పేరు ఏమిటి?**

(సంఖ్యాకాండము)

(రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 125/- లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**ఏప్రిల్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**

1) కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా
2) కె. లక్ష్మిప్రియ, ఒంగోలు
3) బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా
4) శ్రీమతి వి.శారాభాయి, భీమవరం,
5) కె. సుభద్ర, విజయవాడ, కృష్ణాజిల్లా
6) ప్రత్తి అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా
7) యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం, ప్రకాశంజిల్లా
8) టి. చిన్నా, గొల్లపాలెం, మల్కీపురం (మం), తూ.గో.జిల్లా
9) వై.కె. సత్యసారధి, హైదరాబాద్
10) శ్రీమతి జయమ్మ లాబాను, గుంతకల్లు

లక్కిడిప్ ద్వారా **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అను పాటల పుస్తకమును బహుమతిగా పొందిన వారు :
**శ్రీమతి జయమ్మలాబాను, గుంతకల్లు, అనంతపురంజిల్లా**

**బైబిల్ క్విజ్ - 28 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**

1) **కె.సుభద్ర,** కస్తూరిభాపేట, విజయవాడ, కృష్ణా జిల్లా
2) **యం.విక్టోరియారాణి,** గోళ్ళవిడిపి, యర్రగొండపాలెం
3) **పి. అనిత,** ఇచ్ఛాపురం, శ్రీకాకుళంజిల్లా
4) **పి. చిన్నారావు,** విజయవాడ, కృష్ణా జిల్లా
5) **కె. ఉజ్జీవరాజు,** వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా
6) **కె. లక్ష్మిప్రియ,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
7) **బి. ప్రసన్నకుమారి,** ధవళేశ్వరం, రాజమండ్రి, తూ.గో.జిల్లా
8) **బి.ఎస్తేర్‌రాణి,** గోగులమూడి, పెదనందిపాడు(మం), గుంటూరుజిల్లా
9) **పి. దేవదానం,** పెదదోర్నాల, ప్రకాశం జిలా
10) **కె. ఝాన్సి,** సత్యవోలు, రాచర్ల (మం), ప్రకాశం జిల్లా
11) **ఆర్. జయమ్మలాబాను,** గుంతకల్, అనంతపురంజిల్లా
12) **డి. లిల్లిసుచరిత,** దొనకొండ, ప్రకాశం జిల్లా
13) **జె. లక్ష్మినరసింహ,** కొత్తపల్లి, కర్నూలుజిల్లా
14) **శ్రీమతి వై.కె.సత్యసారథి,** అమీర్‌పేట్, హైదరాబాద్
15) **టి. చిన్నా,** గొల్లపాలెం, మల్కీపురం (మం), తూ.గో.జిల్లా
16) **ఎస్. రమ్య,** ధవళేశ్వరం, రాజమండ్రి, తూ.గో.జిల్లా
17) **కె. ప్రేమారూత్,** నగరంపాలెం, గుంటూరు
18) **శ్రీమతి వి.శారాభాయి,** భీమవరం, ప.గో.జిల్లా
19) **డి. ఇవాంజిలిన్,** మర్రిపూడి, ప్రకాశంజిల్లా

లక్కిడిప్ ద్వారా **"నా కుమారి"** అను పుస్తకమును బహుమతిగా పొందిన వారు :
**కె. లక్ష్మిప్రియ, ఒంగోలు, ప్రకాశంజిల్లా**

## బైబిల్ క్విజ్ - 28 జవాబులు

**1.** సంచిలో (యోబు.14:17) **2.** దుష్టుడు (15:20) **3.** యోబు (16:1,20) **4.** భక్తిహీనుల (7:9) **5.** బిల్దదు (18:1,18) **6.** యోబు (19:17) **7.** నాశనమగును (20:28) **8.** శ్రేయస్సు కలిగి (21:13) **9.** సమాధానము (22:18) **10.** యోబు (23:1,10) **11.** పాతాళము (24:19) **12.** బిల్దదు (25:1,4) **13.** అందము (26:13) **14.** రాత్రివేళ (27:20) **15.** కెంపులకన్న (28:18) **16.** హంసవలె (29:18) **17.** వెలుగు (30:26) **18.** కలుపును (31:40) **19.** బరకెయేలు (32:2) **20.** దేవుడు (33:13



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 29

యోబు 34 నుండి కీర్తనలు 11 వరకు



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. 'దేవుడు అన్యాయము చేయుట అసంభవము' అని పలికినది ఎవరు? (యోబు 34వ అధ్యాయం)
2. దేవుడు ఎలాంటి మాటలను చెవినిబెట్టడు? (35 అ)
3. ఆయన తన చుట్టు ఏమి వ్యాపింపజేయును? (36 అ.)
4. తుపాను ఎక్కడ నుండి వచ్చును? (37 అ.)
5. యెహోవా ఎక్కడ నుండి యోబునకు ప్రత్యుత్తరమిచ్చెను? (38 అ.)
6. నిప్పుకోడి ఎందుచేత తన రెక్కలను ఆడించును? (39 అ.)
7. ఏ జంతువు యొక్క శక్తి దాని నడుములో ఉన్నది? (40 అ.)
8. గర్వించిన జంతువులన్నిటికి రాజు ఏది? (41 అ.)
9. యోబు ఎన్ని సంవత్సరాలు బ్రదికాడు? (42 అ.)
10. నీతిమంతుల సభలో ఎవరు నిలువరు? (కీర్తనలు1 అ)
11. ఏలికలు ఏకీభవించి ఏమి చేయుచున్నారు? (2 అ.)
12. ఎలుగెత్తి యెహోవాకు మొఱ్ఱపెట్టినప్పుడు ఆయన ఎక్కడ నుండి ఉత్తరమిచ్చును? (3 అ.)
13. యెహోవా ఎవరిని తన కొరకు ఏర్పరచుకొనుచున్నాడని తెలుసుకోవాలి? (4 అ.)
14. యెహోవా సన్నిధిని ఎవరు నిలువలేరు? (5 అ.)
15. ఎవరికి యెహోవాను గూర్చిన జ్ఞాపకము ఉండదు? (6 అ.)
16. దేనినిబట్టి ఆయన తీర్పు తీర్చును? (7 అ.)
17. దేవుని కంటే మానవుని ఎంత తక్కువ వానిగా చేసెను? (8 అ.)
18. దుష్టులును దేవుని మరచు జనులందరును ఎక్కడికి దిగిపోవుదురు (9 అ.)
19. ఆయన దేశములో నుండి ఎవరు నశించిపోయిరి? (10 అ.)
20. యెహోవా ఎవరిని పరిశీలించును? (11 అ.)

### -: గమనిక :-

మీ జవాబులను **SMS/Whatsapp** ద్వారా కూడా పంప వచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"బైబిల్‌క్విజ్ - 29"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి "నా దూత" (బాప్తిస్మమిచ్చు యోహాను కథ) అను పుస్తకము (వెల రూ. 50/-) లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

## సీరియల్ నంబరు

మరియు మీ

## ఫోన్ (మొబైల్) నంబరు

తప్పని సరిగా వ్రాయాలి. లేనిచో జవాబులు అంగీకరించబడవు.

## చందాదారుల వివరాలు

| | |
|---|---|
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. 1,200 |
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. 1,000 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. 1,000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీమతి అరుణమ్మ, ఒంగోలు | రూ. 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 500 |
| శ్రీమతి కె.లూధియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. 500 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం (ఆగష్టు) | రూ. 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం (అక్టోబర్) | రూ. 300 |
| శ్రీమతి సువర్ణరత్నకుమారి, విజయవాడ | రూ. 300 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. 200 |
| పాస్టర్ కె. జాన్‌మార్ఫ్, క్రొత్తపట్నం | రూ. 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కీపురం, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. 200 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. 200 |
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. 200 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. 150 |

## పాఠకుల పేజీ

'పరిశుద్ధత' పత్రికలో **'పాఠకుల పేజీ'** అనే శీర్షిక ప్రారంభించుచున్నాము. ఈ పేజీ పూర్తిగా పాఠకులకు కేటాయించబడినది. ఈ పేజీలో మీ కుటుంబ సభ్యుల యొక్క పుట్టినరోజు, పెళ్ళిరోజు వేడుకలకు సంబంధించి వారికి పత్రికా ముఖంగా శుభాకాంక్షలు తెలియజేయ వచ్చును. మీ కుటుంబంలోని యువతీ యువకుల వివాహ సంబంధ సమాచారం అలాగే సువార్త సభల సమాచారం, పదవీ విరమణ సమాచారం, జ్ఞాపకార్థ కూడికల సమాచారం కూడా పంపవచ్చు. పత్రిక గురించి మీరు వ్రాసే ఉత్తరాలు కూడా ఈ శీర్షికలో ప్రచురించబడతాయి. అయితే ఈ అవకాశం ఉపయోగించదలుచుకునే వారు చందాదారులై ఉండాలి. పత్రికకు కట్టిన చందా మొత్తాన్నిబట్టి వారికి స్థలం కేటాయించబడుతుంది. సంవత్సర చందాదారులకి పేజీలో 1/4, రూ. 500 కట్టిన వారికి 1/2 పేజీ, రూ. 1000 కట్టిన వారికి ఫుల్ పేజీ కేటాయించబడును. రూ. 2000 కట్టిన వారికి టైటిల్ (కలర్) లోపలి పేజీలో 1/2 పేజి. రూ.5000 కట్టిన వారికి టైటిల్ లోపలి ఫుల్ పేజీ కేటాయించబడును. అయితే ఈ అవకాశం సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. ప్రతి నెలా 5వ తేదీ తర్వాత తేదీలలోని సంధర్భాలను మాత్రమే పంపించాలి. ఫోటో ప్రచురించాలంటే మీ ఫోటోని **Whatsapp** ద్వారా 9440217726కి లేదా ఈ-మెయిల్ ద్వారా holiness.ierf@gmail.comకి పంపాలి. పోస్ట్‌లో పంపకూడదు.

| | |
|---|---|
| పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జద్చర్ల | రూ. 150 |
| పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట | రూ. 150 |
| శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. 150 |
| పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. 150 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. 150 |
| పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా | రూ. 150 |
| శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా | రూ. 150 |
| శ్రీమతి పి. విజయలక్ష్మి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా | రూ. 150 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. 150 |
| శ్రీ టి. సునీల్‌కుమార్, కోవెరపాలెం, నెల్లూరుజిల్లా | రూ. 150 |
| శ్రీమతి వై. కెజియాసత్యసారధి, హైదరాబాద్ | రూ. 150 |
| వి. మేరినిర్మల, మెట్రోపాలిటన్ మిషన్, విజయవాడ | రూ. 150 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. 100 |
| పాస్టర్ బి. జకర్యా, రావిపాడు, ప్రకాశం జిల్లా | రూ. 100 |

నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము